

ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు మేలు

నవతెలంగాణ-కోహెడ: ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందని ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సముద్రాల గ్రామంలో రైతులకు ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ మొక్కల కోసం ఎకరానికి రూ.9 వేల 6 వందలను ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సంవత్సరానికి 4 వేల 2 వందల రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాలు రాయితీ ఉంటుందన్నారు. పామాయిల్ విస్తరణకు 11 కంపెనీలకు ఫ్యాక్టరీ జోన్లుగా కేటాయించడం జరిగిందన్నారు. ఒక్కసారి నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడి రావడం జరుగుతుందని, ఫ్యాక్టరీ సిబ్బందే ఆయిల్ ఫామ్ తోటకు వచ్చి కొనుగోలు చేయడం జరుగుతున్నారు. రైతులకు ఎలాంటి కోతుల బెడద ఉండదని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జిల్లా డీహెచ్‌వో సునీత, రైతుబంధు డిస్టిక్ మెంబర్ రామ్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ నాయకుడు ఇప్పలపల్లి కృష్ణమూర్తి, సర్పంచ్ పిల్లి మాధవి, ఎంపీటీసీ పూల విజయ పాల్గొన్నారు.

భయాన్ని వదిలి ఆరోగ్యానికి కాపాడుకోవాలి

జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, ఎంపీపీ శ్రీదేవి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



భయాన్ని వదిలి ఆరోగ్యానికి కాపాడుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాలలోని మహిళలకు రుతుప్రేమపై డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రత్యేక శ్రద్ధతో మహిళలకు మెనుస్ట్ వల్ కప్ లను అందించేందుకు ప్రత్యేకంగా ఋతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టారని మహిళలందరూ ఆరోగ్య సంరక్షణకు తప్పనిసరిగా రుతుస్రావం సమయంలో మేనుస్ట్ వల్ కప్పులను ఉపయోగించాలని అన్నారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని మెనుస్ట్ వల్ కప్పుల వాడడం వలన మహిళలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. వివాహం అయిన మహిళలు మెనుస్ట్ వల్ కప్పులను, వివాహం కాని యువతులు క్లాత్ ప్యాడ్లను ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీహరి గౌడ్ ,డిపిఓ దేవకి దేవి, ఎంపీడీవో రాఘవేంద్ర రెడ్డి ,ఏ పి ఎం విజయనిర్మల, ఎంపీఓ హరిప్రసాద్, సర్పంచులు ఎల్లవ్వ, హంసకేతన్ రెడ్డి, పంజా భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

24న చలో కలెక్టరేట్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, కాంగ్రెస్ జెడ్పి ఫ్లోర్ లీడర్ గిరికొండ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట మండలాల కోర్ కమిటీ సమావేశం మండల కేంద్రంలోని వాసవి గార్డెన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోర్కైన రెవెన్యూ డివిజన్ సాధించుకోవడం కోసం రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, కుల సంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం పోరాడవలసిన సమయం ఆసన్నమైందన్నారు. డివిజన్ ఏర్పాటే ఏకైక లక్ష్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మన ప్రాంతం, అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నారు. అందుకోసం రాజకీయ పార్టీలకు అతీతంగా జేఏసీ నిర్వహించే ఉద్యమంలో కలిసివచ్చి ఈనెల 24న జరిగే ఛలో కలెక్టరేట్ ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్,సీపీఐ(ఎం),సీపీఐ, టిడిపి, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు వకుళాబరణం నర్సయ్య పంతులు, ఆముదాల మల్లారెడ్డి, ఆది శ్రీనివాస్, తడక లింగం, ఆలేటి యాదగిరి, బొమ్మగోని అంజయ్య గౌడ్, రామడుగు బాలరాజు, తాడెం ప్రశాంత్, మంచాల చిరంజీవులు, కొంగరి వెంకట్ మావో, బిజ్జ రాము, బుట్టి సత్యనారాయణ, ఈరి భూమయ్య, చంద శ్రీకాంత్, రాళ్లబండి నాగరాజు, మిట్టపల్లి నారాయణ రెడ్డి, పోతుగంటి ప్రసాద్ గౌడ్, బండకింది అరుణ్ గౌడ్, కొల్పుల యాదగిరి పాల్గొన్నారు.

వ్యవసాయానికి నేడు సింగూరు నీటి విడుదల

నవతెలంగాణ-పుల్కల్



ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.9 టీఎంసీలు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో 18.429 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి 1195 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. దీంతో సింగూరు ఎడమ కాలువ ద్వారా సుమారు 40,000 ఎకరాలకు సాగునీరు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నేటి(బుధవారం) ఉదయం 9.30 గంటలకు ఎత్తిపోతల పథకం ద్వారా అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ చేతుల మీదుగా ఈ నీటిని కిందికి వదలనున్నట్టు బీఆర్ఎస్ పుల్కల్ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తున్నదన్నారు. రైతన్నలు సింగూరు నీటి కోసం ఎదురుచూస్తున్నారని.. నేటితో వారి కల సహకారం కానున్నదన్నారు. నేటి ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్




మహిళల రక్షణ చట్టాలపై ప్రతి ఒక విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఏసీపీ ఎం. రమేష్ అన్నారు. మంగళవారం నాగర్జున జూనియర్ కాలేజ్ విద్యార్థినీలకు మహిళల హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరిగిందన్నారు. మహిళల రక్షణకు చట్టాల, సైబర్ నేరాల, గుడ్ టచ్ బాడ్ టచ్, తదితర అంశాల గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ భూమా వీరప్రసాద్,ట్రాఫిక్ సీఐ తిరుపతి, ప్రిన్సిపల్ భీమ్ రెడ్డి, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ అమృత్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు యుగంధర్, అన్వేష్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, సిద్దిపేట భరోసా సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆగని నిరసన సెగ

- మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన సీఐటీయూ
- చూసీచూడనట్లు వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు

నవతెలంగాణ - మెదక్





గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్మికుల నిరసన సెగ వర్షంలోనూ కొనసాగింది. మంగళవారం తమ హక్కుల సాధన కోసం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. వర్షంలోనూ ఆందోళన కొనసాగగా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చూసి చూడనట్లు వెళ్లిపోవడంతో సీఐటీయూ నాయకులు, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా గ్రాడ్యూటీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఆదివారం పండుగ వేళలో సెలవులు కేటాయించాలనే పలు సమస్యలతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. జులై 6 నుండి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పైన సమ్మెలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చలించడం లేదని, గ్రామపంచాయతీలకు బడ్జెట్ కేటాయించమని సభలో చెప్పినప్పటికీ ఎక్కడ అమలు కావడంలేదన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, 10 డిమాండ్లతో సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చలించలేకపోవడం లేదన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో మెదక్ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడి చేపట్టడం జరిగిందని, కానీ చూసి చూడనట్టు ఎమ్మెల్యే వెళ్లిపోయారని వాపోయారు. గ్రామపంచాయతీ కార్మికులకు పని వేళలో జరిగే మరణానికి రూ. 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, చెత్త ట్రాక్టర్ నడిపే డ్రైవర్లకు లైసెన్స్ పంచాయతీ ఇవ్వాలని, మూడు జతల యూనిఫాం బ్లౌజులు కార్మికులకు ఇవ్వాలన్నారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఛలో ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ప్రవీణ్, ఇందిరా, రవి, రాజు పాల్గొన్నారు.

సఫాయిలపై ఎందుకీ కర్కషత్వం

- 14 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టని సర్కార్
- పల్లెల్లో చెత్తచెదారంతో జనం తిప్పలు
- ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద కార్మికుల ఆందోళనలు
- పారిశుద్ధ్య అవార్డులు తెచ్చినోళ్ల పట్ల కఠినత్వం





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'కరోనా సమయంలో సేవలు చేసిన సఫాయన్నలు దేవుళ్లతో సమానం. వాళ్ల కాళ్లు కడిగి నెత్తిన పోసుకున్నా తప్పులేదు' అంటూ గొప్ప గొప్ప డైలాగులు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ అదే సఫాయి కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే వారి పట్ల ఎందుకంత కర్కషంగా వ్యవహరించాలి. 14 రోజులుగా గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఎండావాననక పోరాటాన్ని నడుపుతున్నారు. తమ న్యాయమైన సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ప్రజల మద్దతు కూడగడుతున్నారు. బిక్షాటన చేశారు. ఒంటికాలుపై నిల్చున్నారు. ఎమ్మెల్యేల ఇంటి ముందు ధర్నా చేశారు. సీఎంకే లేఖ రాశారు. అయినా సఫాయి కార్మికుల పట్ల కనికరం చూపట్లేదు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల సమ్మె ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. అన్ని పంచాయతీల్లో కార్మికులు పనుల్ని బంద్ చేశారు. ఉద్యోగులు సైతం సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. సంగారెడ్డి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సమ్మె శిబిరాల్లో కార్మికులు, ఉద్యోగులు బైటాయించి నిరసన తెలుపుతున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. సంగారెడ్డిలో 647, సిద్దిపేటలో 499, మెదక్‌లో 469 గ్రామ పంచాయతీల్లో కలిపి ఉద్యోగులు, కార్మికులు కలిపి 10 వేల మంది వరకు పనిచేస్తున్నారు. వీరంతా కూడా సమ్మెలో ఉన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు సంఘటితంగా సమ్మె చేస్తున్నందున పల్లెల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులేర్పడుతున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయంగా ఉపాధి హామీ కూలీలతో పనులు చేయిస్తున్నా ప్రజల అవసరాలు తీరడంలేదు.

14వ రోజుకు చేరిన సమ్మె

గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి సమ్మె చేపట్టారు. బుధవారంతో సమ్మె పోరాటం 14వ రోజుకు చేరింది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. రోజుకో విధంగా సమ్మె పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. బిక్షాటన చేసి ప్రజల్లో ప్రభుత్వ వైఖర్ని ఎండగట్టారు. ఒంటికాలిపై నిల్చుండి సమ్మె చేశారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజల కోసం పనిచేస్తున్న తమ న్యాయమైన సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వంపై వత్తిడి తేవాలంటూ డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల్ని ముట్టడించారు. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్ద వేలాది మంది కార్మికులు ఆం దోళన చేశారు. మెదక్, సంగారెడ్డిలోని అన్ని అసెంబ్లీ నియోకవర్గాల్లోనూ ఆందోళనలు జరిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్చలు జరపాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ గ్రామ పంచాయతీ సమ్మెను ముందుండి నడుపుతోంది.

ఆవార్డులు తెచ్చినోళ్ల పట్ల కఠినత్వం ఎందుకు: గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి



పారిశుద్ధ్య ఆవార్డులు తెచ్చిపెట్టిన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎందకంత కఠినంగా వ్యవహరించాలి. ప్రజలకు సేవలు చేస్తూ ప్రభుత్వానికి ఆవార్డులు తెస్తున్న కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి. 17 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి. లేనిపక్షంలో సమ్మె పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. పది వేల కుటుంబాలు వీధిన పడి పోరాడుతుంటే ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పట్టింపులేకపోవడం విచారకరం. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు సైతం కార్మికులు సిద్ధంగా ఉన్నారు.

సమ్మె డిమాండ్లు ఇవే..

17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీస్‌ను జేఏసీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఇచ్చిన నోటీస్‌లో పేర్కొన్న డిమాండ్లు ఇలా ఉన్నాయి.

- గ్రామ పంచాయతీ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలి. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా ఇవ్వాలి.
- పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్‌ను రూ.19 వేల వేతనంగా చెల్లించాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి.
- జీవో నెంబర్ 51ని సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి. పాత కేటగిరిలన్నిటినీ యథావిధంగా కొనసాగించాలి.
- విధుల నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారమివ్వాలి. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. సహజ మరణానికి రూ.5 లక్షలివ్వాలి. దహన సంస్కారాలకు రూ.30 వేలివ్వాలి.
- 2011 జనాభా ప్రకారం కాకుండా అవసర ప్రాతిపదికన కార్మికుల్ని తీసుకోవాలి. వేతనాలు పెంచాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులివ్వాలి.
- 8 గంటల పనివిధానం అమలు చేయాలి. వారాంతపు, పండగ, జాతీయ ఆర్థిక సెలవులివ్వాలి.
- కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. అన్ని కార్మిక చట్టాల్ని అమలు చేయాలి.
- ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- సంవత్సరానికి మూడు జతల యూనిఫాంలు, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలు, టవళ్లు ఇవ్వాలి.

వ్యవస్థాపకులుగా ఎదగండి

నవ తెలంగాణ - పటాన్ చెరు



మనదేశంలో అంచనా, విశ్లేషణ సాధనాలు చాలా పరిమితంగా ఉన్నాయని, భవిష్యత్తు కోసం డేటాను విశ్లేషించే నైపుణ్యం సాధిస్తే వ్యవస్థాపకులుగా ఎదిగి, సొంత కాళ్లపై నిలబడొచ్చని బెంగళూరులోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్. వెంకటేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'జాతి నిర్మాణంలో రాక్ ఇంజనీరింగ్' పాత్ర అనే అంశంపై మంగళవారం నిర్వహించిన ఒక రోజు కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఆజాది కా అమృత్ మహోత్సవ్' లో భాగంగా, కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎన్ఐఆర్ఎం. సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశారు. స్టార్టప్ ఇండియా ఉద్యమం 2004లో ప్రారంభం కాగా, 2015 వరకు కేవలం వంద స్టార్టప్‌లు మాత్రమే ఉన్నాయని, ఆ సంఖ్య నేటికి లక్షకు చేరినట్టు సభికుల హర్షధ్వానాల మధ్య డాక్టర్ వెంకటేష్ ప్రకటించారు. అయితే అందులో కేవలం 82 మాత్రమే గనుల రంగానికి చెందినవని, ఆ రంగంలోని సమాచారాన్ని విశ్లేషించే సామర్థ్యాన్ని సాధిస్తే డేటా సెట్టింగ్‌గా ఎదగొచ్చన్నారు. 'రాక్ బ్లాస్టింగ్ ఎ టూల్ ఫర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సభాధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి మాట్లాడుతూ గనులు, శక్తి, ఓడరేవులు, క్రూడాయిల్ వ్యూహాత్మక నిల్వ, భౌగోళిక అనుసంధాన (రహదారుల) రంగాలలో అనేక ప్రాజెక్టులు మనదేశంలో అమలు చేస్తున్నారని, మౌలిక సదుపాయాల రంగంలో భారత్ దూసుకుపోతోందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన వెన్సార్ కన్‌స్ట్రక్షన్స్ సలహాదారు డాక్టర్ ఎం.ఎస్. వెంకటరామయ్య మాట్లాడుతూ వర్ధమాన ఇంజనీర్లుగా ఎదుగుతున్న విద్యార్థులు సవాళ్లను స్వీకరించి, మెరుగైన పరిష్కార మార్గాలను కనుగొనాలని సూచించారు. తొలుత, కార్యశాల నిర్వాహకురాలు ప్రొఫెసర్ టి. మాధవి దాని లక్ష్యాలతో పాటు గీతమ్ గురించి వివరించగా, సమన్వయకర్త డాక్టర్ సీహెచ్. అఖిలేష్ వందన సమర్పణ చేశారు.ఎస్ఐఆర్ఎం శాస్త్రవేత్తలు డాక్టర్ పీసీ ఝా, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ బీఎన్వీ శివప్రసాద్ తదితరులు నిజ, సమయ సవాళ్ల గురించి అవగాహన కల్పించడానికి రాక్ ఇంజనీరింగ్ పై పరిశోధనల సైద్ధాంతిక, ఆచరణాత్మక అంశాలను వివరించారు. హైబ్రీడ్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మనదేశంలోని ఇరవై విద్యా సంస్థలకు చెందిన దాదాపు 1,150 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ ఒకరోజు కార్యశాలలో పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్



ఎన్నికల ప్రక్రియలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పెండింగ్ దరఖాస్తులు, డ్రాఫ్ట్ ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ, మున్సిపల్ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా వేగంగా సవరణ పూర్తి చేయాలన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల ముందు, మనకు వచ్చిన ప్రతి దరఖాస్తు పూర్తి చేయాలని, ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు ఇంటింటికి తిరిగి 6 కంటే అధికంగా ఉన్న ఓటర్ల వివరాల ధృవీకరణను పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటింటి సర్వే నేపథ్యంలో వచ్చిన దరఖాస్తులు, ఆన్ లైన్ ద్వారా ఫారం 6, ఫారం 7, ఫారం 8 క్రింద వచ్చిన దరఖాస్తులను జూలై 27 నాటికి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఓటరు జాబితా నుంచి ఓటర్ల వివరాలు తొలగించిన నేపథ్యంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఈవిఎం, వివిప్యాట్ వినియోగం పై విస్తృతఅవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న మండలాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్ లను విజిట్ చెయ్యాలన్నారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు ప్రతిది సమకుర్చేలా ఏర్పాటు చెయ్యాలని తహసీల్దార్ లకు తెలిపారు . బిఎల్‌ఓస్, ఈఆర్‌ఓలు, అందరు అధికారులు సమన్వయంతో పనిచేసి మళి విడత సమావేశం లోపు అన్ని పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ బెన్ సాలమ్, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో భార్యను హతమార్చిన భర్త

అదరపు కట్నమే కారణమంటున్న స్థానికులు

నవ తెలంగాణ మిరు దొడ్డి



కుటుంబ కలహాలతో భార్యను భర్త హత్య చేసిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంది. అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తరచూ గొడవ చేస్తూ భార్యను చిత్రహింసలకు గురి చేసేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబీకుల కథనా ప్రకారం... మిరుదొడ్డి గ్రామానికి చెందిన కనకరాజు చల్మెడ గ్రామానికి చెందిన భవానితో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలలు సాఫీగా సాగుతున్న సంసారంలో అదనపు కట్నం చిచ్చురేగింది. భార్యను తరచూ కనకరాజు వేధించడంతో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. తీరు మారని కనకరాజు భార్యను అదే విధంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. తెల్లవారుజామున భార్య గొంతు నులిమి చంపాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చేసరికి భర్త కనకరాజు ఇంట్లో నుండి పారిపోయాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కనకరాజుపై కేసు నమోదు చేసిన పోలీసులు కనకరాజు కోసం గాలింపు చేపట్టారు. భవానీ మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే తమ కూతురిని హత్య చేసిన కనకరాజు కఠినంగా శిక్షించాలని రోధిస్తూ డిమాండ్ చేశారు. భవానీని హత్య చేసిన విషయం దావణంలా వ్యాపించడంతో పెద్ద ఎత్తున స్థానికులు ఘటన స్థలానికి చేరుకున్నారు. భవానీ మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టారు.

రైతు రాజ్యం కావాలా.. రాక్షస రాజ్యం కావాలా?

రైతు సమావేశంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

నవతెలంగాణ-రాయికోడ్



రైతులకు 24 గంటల ఉచిత కరెంటును ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వ రైతు రాజ్యం కావాలా.. లేక రైతులను ఇబ్బందులకు గురిచేసే కాంగ్రెస్ పార్టీ రాక్షస రాజ్యం కావాలా?'. రైతులు ఎటు వైపు ఉంటారో ఆలోచించాలని ఆందోల్ ఎమ్మెల్యే చాటి క్రాంతి కిరణ్ అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రాయికోడ్ మండలంలోని రాయికోడ్, సింగీతం గ్రామాల రైతు వేదికల్లో మంగళవారం రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుష్కలంగా సాగు నీరు, నిరంతర ఉచిత కరెంట్‌తో తెలంగాణలో పంటలు బాగా పండుతున్నాయని.. దీంతో రైతులు ధైర్యంగా ఉన్నారన్నారు. ఇప్పుడు రైతులకు 3 గంటలు విద్యుత్ చాలంటూ చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు. 3 గంటల కరెంట్‌ను మేనిఫెస్టోలో పెట్టి దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. ప్రజలను మళ్ళీ మోసం చేసేందుకు పగటి వేశగాళ్ళ రూపంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు వస్తున్నారని, వారి మాటలు విని మోసపోతే గోస పడతారని.. రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతులు బాగుండాలని రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు ధరతో కొంటున్నదన్నారు. రైతులకు రైతు బంధు, రైతు భీమా, పంటకు మద్దతు ధర, రుణమాఫీ, ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువుల పంపిణీ, కొనుగోలు కేంద్రాలు, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను రైతుల కు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, ఎంపీపీ మమత అశోక్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్న పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్, ఆత్మ చైర్మన్ చేవెళ్ల విఠల్, ఏఎంసి వైస్ చైర్మన్ మారుతి, వరం ఉపాధ్యక్షుడు తుకారం, పీఏసీఎస్ చైర్మన్ హన్మగౌండ, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ సంతోష్ పాటిల్, ఎంపీటీసీ నిరంజన్, టీఆర్ఎస్వి కార్యదర్శి నజీమ్ పటేల్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు మల్లేష్ కురుమ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న ముసురు

- ఎడతెరపి లేకుండా వాన
- చల్లగా మారిన వాతావరణం
- మరో నాలుగు రోజులు వానలు
- మెట్ట పైర్లకు మేలంటున్న అధికారులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ముసురు వాన కమ్ముకుంది. ఎడతెరపి లేకుండా వాన పడుతోంది. ఆకాశమంతా మబ్బులు కమ్మేయడంతో వాతారణం ఒక్కసారిగా చల్లబడింది. సోమవారం రాత్రి నుంచి ముసురు వాన కురుస్తోంది. వాయివ్య బంగాళఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అరకొర వర్షాలు కురిసినందున ఖరీఫ్ పంటల సాగు ఆశాజనకంగా సాగలేదు. కురుస్తున్న వర్షాల వల్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మెట్ట పంటలకు వర్షాలు మేలు చేస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి ముసురు వాన కురుస్తోంది. తేలిక పాటి జల్లులు పడుతున్నాయి. ఒక్కోసారి మోస్తరు వర్షం పడుతోంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు 24 గంటల పాటు నిరంతరం వర్షం కురిసింది. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాల్లోనూ వర్షం పాతం నమోదైంది. జిల్లా సగటు వర్షాపాతం 12.8 మిల్లీ మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా మొగుడంపల్లిలో 20.9 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. సిర్గాపూర్‌లో 16.02, కంగ్టిలో 15.0, నారాయణఖేడ్‌లో 11.0, నాగిల్‌గిద్దలో 10.5, మనూరులో 10.8, న్యాల్‌కల్‌లో 10.8, జహీరాబాద్‌లో 14.9, రాయికోడ్‌లో 13.4, కోహీర్‌లో 13.1, ఝరాసంగంలో 16.3, మునిపల్లిలో 8.0, వట్‌పల్లిలో 10.9, ఆందోల్‌లో 12.3, పుల్కల్‌లో 14.2, సదాశివపేటలో 13.1, కొండాపూర్‌లో 13.1, గుమ్మడిదలలో 10.9, జిన్నారంలో 13.2, కందిలో 12.1, పటాన్‌చెరులో 13.6, అమీన్‌పూర్‌లో 14.7 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. మెదక్, సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాల్లో సగటున రూ.10 మిల్లీ మీటర్ల నుంచి 16 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది.

రైతుల హర్షం

ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన మేరకు వర్షాపాతం నమోదు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో మెట్ట పంటల్ని సాగు చేశారు. పత్తి, కంది, ఇతర మెట్ట పంటలేశారు. అవి మొలకలొచ్చి పెరుగుతున్నాయి. చాలా చోట్ల పత్తి పైర్లకు గుంటుక తోలుకుంటున్నారు. ఇతర మెట్ట పంటలకు కూడా ఈ వర్షాలు దోహదపడుతున్నాయి. వర్షాలు పడితే పైర్లు ఏపుగా పెరిగేందుకు అవకాశమున్నందున రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అదే విధంగా వరి నార్లు పోశారు. 20 రోజులు దాటినందున ఈ వారంపది రోజుల్లో నాట్లు వేసుకోవాల్సి ఉంటుంది. నాట్లు వేసేందుకు పొలాల్ని దమ్ము చేసేందుకు సరిపడ నీటి సరఫరాలేదు. బోర్ల కింద నీటి లభ్యత అంతగాలేనందున నాట్లకు పొలాల్ని సిద్ధం చేయడం ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు కింద కూడా నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆచితూచి ఆలోచిస్తుంది. వర్షాలు పడితే ఒకే లేదంటే ప్రాజెక్టుల్లో ఉన్న నిల్వల్ని పొదుపుగా వినియోగించాలని చెబుతుంది. ఈ వర్షాలు ఇలాగే కురిస్తే వరినాట్ల పనుల్లో ఊపందుకోనుంది.




నవతెలంగాణ-నార్సింగి

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మండల వ్యాప్తంగా రెండు రోజులుగా వానలు కురుస్తున్నాయి. ఈ ఏడు వానలు ఆలస్యమైనందున కర్షకులు ఆందోళన చెందారు. వానలు లేక ఎండలు మండు తుండడంతో తూకాలు ఎండిపోతాయని దిగులు పడ్డారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల రైతులలో హుషారు పెరిగింది. ఇప్పటికే కొంత మంది నాట్లు వేసినా, చాలా వరకు వేయలేదు. ఇపుడు కురుస్తున్న వర్షాల వల్ల అన్ని పొలాలలో నాట్లు వేయడం మొదలు పెట్టారు. వర్షానికి ఒళ్ళు తడవకుండా ఉండడానికి రంగు రంగుల ప్లాస్టిక్ కవర్లు కప్పుకుని పాటలు పాడుకుంటూ మహిళలు నాట్లు వెస్తుండడం కంటికి ఇంపుగా ఉండి, చూసే వారిని ఇటే కటి పడేస్తుంది. సాధారణం కన్నా ఒక నెల ఆలస్యంగా నాట్లు వేయాల్సి వస్తుంది. నాట్లు వేస్తున్న వారు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు సరైన చర్యలు తీసుకుని ఇప్పటికైనా పంట దిగుబడిని పెంచుకోవచ్చు. సరైన ఎరువుల యాజమాన్య పద్ధతులతో, ఆలస్యమైనా అధిక దిగుబడి రాబట్టోచ్చని నార్సింగి మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి అన్నారు . వ్యవసాయ అధికారి యాదగిరి రైతులకు సూచనలు చేస్తూ నాట్లు వేయడానికి ముందు ఆఖరి దుక్కిలో ఎకరా కు 30 కిలోల జింక్ సల్ఫేట్ ను వేసుకున్న 24-48 గంటల తరవాత 30 కిలోల యూరియా, 100 కిలోల కాంప్లెక్స్ ఎరువులు, 25 కిలోల పొటాష్ ను వేసుకోవాలని సూచించారు. నాటు వేసిన 30 రోజుల తరువాత కలుపు తీయడానికి ముందు ఎకరా కు 30 కిలోల యూరియా వేసుకోవాలని, రెండవ సారి 60 రోజుల లోపు కలుపు తీసుకోవాలని, రైతులు సాధారణంగా ఈ దశను ఈనే దశ అంటారని, కలుపు తీసుకోవడానికి ముందు 30 కిలోల యూరియా తో పాటు 25 కిలోల పొటాష్ ను వేసుకోవాలని, సరైన మోతాదులో ఎరువులు వాడాలని తద్వారా అనవసర ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందనీ మండల వ్యసాయాధికారి యాదగిరి రైతులకు సూచించారు.



సంతోషం



పోయిన ఏడాది ఈ రోజుల వరకు చెరువులు నిండి అలుగులు పారాయి. ఈఏడు వర్షాలు పడకపోవడంతో భయపడి పోయాం. తూకాలు ఎండి పోతాయని, ఏం చేయాలో అర్థం కాక దిగాలు పడ్డాం. రెండు రోజులుగా వానలు కురుస్తున్నాయి. సంతోషంగా ఉంది. వర్షాలు లేకపోవడంతో నాట్లు వేయడం ఒక నెల ఆలస్యమైంది, అయినా ఫరవా లేదు నష్టం కాదు. పంట సమయం పెరుగుతుందంతే. వానలు పడడం తో ప్రాణం లేసి వచ్చి నట్టయింది.

- పురం స్వామి, రైతు, నార్సింగి

ప్రభుత్వ విప్ శంబిపూర్ రాజును కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జిన్నారం

రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంబీపూర్ రాజును మంగళవారం పటాన్చెరు నియోజ కవర్గం శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంబిపూర్ రాజు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్.. ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, కాజిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆకుల నవీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నాయికోటి రాజేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టి.బి నివారణకు అందరూ సహకరించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిని టి.బి రహిత జిల్లాగా రూపొందించాలని.. అందుకు అందరూ సహకారించాలని జిల్లా క్షయ నివారణ అధికారిని డాక్టర్ రాజేశ్వరి కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రుద్రారంలో గల ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో యాజమాన్యంతో కలిసి టి.బి ప్లేడ్జ్ (ప్రతిజ్ఞ)ను ఆమె ఆవిష్కరించారు. కాగా టి.బి నివారణలో తమవంతు సహాయ సహకారాన్ని అందిస్తామని ఎంఎస్ఎన్ యజమాన్యం ఈ ముందుకురాగా.. వారి సహకారాన్ని రాష్ట్ర క్షయ నివారణ విభాగం ఐఈసీ అధికారి జితేంద్ర అభినందించా రు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రొడక్షన్ కె.వెంకటరెడ్డి, సీనియర్ జీఎం కేఎల్ఎన్ మూర్తి, హెచ్ఆర్, డీజీఎం ఫెసిలిటీ మేనేజ్మెంట్ కామేశ్వరరావు, డీసీఎం సేఫ్టీ వాసు బాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ఎ, స్వీ కృష్ణంరాజు, టి.బి అలర్ట్ ఇండియా వికాస్ పానిభట్ల, డైరెక్టర్ రమేష్, మేనేజర్ పరస పురుషోత్తం, కో-ఆర్డినేటర్స్ కృష్ణ, నర్సింలు, అరుణ, చంద్రకళ పాల్గొన్నారు.

యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్



నవతెలంగాణ-కంది

తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన సొంత నిధులతో నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందజేయనున్నట్టు చెప్పారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివలింగయ్య ఆర్టీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కాగా ఉచితంగా లైసెన్స్‌లు ఇవ్వాలనే చింతా ప్రభాకర్ ఆలోచన పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద, మధ్య తరగతి యువతీ యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, చింతా సాయినాథ్, ఖాజా ఖాన్, కుమార్, మోహన్ నాయక్, శ్రావణ్‌రెడ్డి, జలేందర్, విఠల్ పాల్గొన్నారు.

చిట్కుల్ వడ్డెర కాలనీలో వైభవంగా బోనాల పండుగ



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని వడ్డెర కాలనీలో మంగళవారం నిర్వహించిన బోనాల పండుగలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, అంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాలను తనిఖీ చేసిన ప్రోగ్రాం ఆఫీసర్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలను రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ వాసు దేవ రెడ్డి బృందం మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య శ్రీ విభాగంతో పాటు దినసరి సేవల రికార్డుల పరిశీలన, ఇన పేషెంట్స్, ఔట్‌పేషెంట్లు వైద్యశాలలో జరుగుతున్న ప్రసూతిల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల మధ్య సఖ్యత లేకపోవడంతో రోగులకు పలు అసౌకర్యాలు జరుగుతున్నట్లు గుర్తించినట్టు చెప్పారు. ఈ విషయమై నివేదికను ఉన్నత అధికారులకు అందిస్తామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో గల స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పనా శిక్షణ కేంద్రంలో రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్టు ఎస్‌బిఆర్ఎస్ఈటి డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏండ్ల వయసు గల పురుషులు శిక్షణకు అర్హులని.. మెదక్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంత పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో వారు శిక్షణకు అర్హులు కారు అన్నారు. అభ్యర్థులు నివాస ధ్రువీకరణకు రేషన్‌కార్డ్‌తో పాటు, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, 4 పాసుపోర్టు సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 24 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని.. ఉచిత శిక్షణతోపాటు శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయన్నారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్ లో నైపుణ్య శిక్షణతోపాటు వ్యాపార నిర్వాహణ అభివృద్ధి, ఖాతాలనిర్వహణ సంభాషణ నైపుణ్యాలలో శిక్షణ ఉంటుంది అన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ కిట్ ఇస్తారన్నారు. ఆసక్తి గలవారు సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో దరఖాస్తులను ఇవ్వాలని లేదా 9704446956, 9490129839కు వాట్సాప్ కూడా చేయవచ్చు అన్నారు.

ఆర్టీసీ జహీరాబాద్ డి.ఎంను సన్మానించిన నగేష్



నవతెలంగాణ-మునిపల్లి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జహీరాబాద్ డిపో మేనేజర్ రజనీకుశను మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామ సర్పంచ్ నగేష్ యాదవ్ సత్కరించారు. ఆర్టీసీ చేపడు తున్న చర్యలు వివరించడంతోపాటు వివిధ రకాల బస్సు పాసులు అందించేందుకు గ్రామానికి వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపోకు చెందిన కండక్టర్ డ్రైవర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షం కారణంగా చెరుకు రైతుల దీక్ష వాయిదా



నవతెలంగాణ-జహీరాబాద్

స్థానిక ట్రైడెంట్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రభుత్వ ఆధీనంలో నడిపించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన అఖిలపక్ష చెరుకు రైతుల దీక్ష వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్టు అఖిలపక్ష నాయకులు ఆశప్ప నరసింహారెడ్డిలు ప్రకటించారు. త్వరలో తేదీని ప్రకటిస్తామన్నారు.

బాధితులకు నీలం మధు సాయం



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని దాదిగూడ గ్రామానికి చెందిన ఎన్ఎంఆర్ కార్యకర్తలు సంబరబోయిన నాగరాజు, నిఖిల్ రోజువారి పని నిమిత్తం కంపెనీకి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ రూ.20,000 సాయాన్ని బాధితులకు అందించినట్టు ఎన్ఎంఆర్ యువ సేన ప్రతినిధి సుంకరబోయిన మహేష్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎన్ఎంఆర్ యువసేన నాయకులు సుంకర బోయిన మహేష్‌వీరబోయిన సాయి, వీరంగారి వినోద్ కుమార్, అందూర్ రాజు, మోత సందీప్‌లు పాల్గొన్నారు.



షేర్ఖాన్‌పల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-హత్నూర

షేర్ఖాన్‌పల్లి పంచాయతీని జిన్నారం మండలంలో కలపడానికి ప్రజాభిప్రాయ సేకరణ కోసం సర్పంచ్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళ వారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. షేర్ఖాన్‌పల్లిని హత్నూర మండలం నుంచి జిన్నారం మండలంలో కలపాలని స్థానిక ఎమ్మెల్యేకి, ఉన్నతాధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మండలాఫీసులో ఏదైనా పని ఉంటే 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని.. అదే జిన్నారం కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంటుందన్నారు. కాబట్టి తమ గ్రామాన్ని జిన్నారంలో కలపాలని గ్రామ ప్రజల అభిప్రాయాన్ని సేకంచడం జరిగిందన్నారు. గ్రామస్తులు కూడా జిన్నారం మండలంలో కలపాలని ఏకతాటిపై అభిప్రాయం చెప్పారన్నారు. ఈ కార్యక్ర మంలో వార్డు సభ్యులు శివరాజ్, లింగం గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్ గౌడ్, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సంజీవ, నారాయణ, నర్సింగరావు, పోచ గౌడ్,గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పల్లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలి

- వందశాతం ప్యూరిఫైయర్ ఓటరు లిస్ట్ కావాలి
- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



నవతెలంగాణ-సంగారెడ్డి

తప్పులు లేని పారదర్శకంగా ఉండే ఓటరు జాబితాను రూపొందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు బీఎల్ఓ, బీఎల్వో సూపర్వైజర్ల సామర్థ్యాల పెంపు, ఓటరు జాబితా రూపకల్పన, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, విధులు, బాధ్యతలు తదితర అంశాలపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. వందశాతం ప్యూరిఫైయర్ ఓటర్ లిస్ట్ సిద్ధం చేయాలన్నారు. అర్హులందరూ ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక ఇంట్లో ఓటు హక్కు గల కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్లు దాటితే రెండో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాను ప్రతి మూడు నెలలకు ఒకమారు అప్డేట్ చేయాలన్నారు. బీఎల్ఓలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, తుది ఓటరు జాబితా, సమ్మరీ రివిజన్ తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. బిఎల్ఓలను ఈఆర్ఓ నియమిస్తారన్నారు. బీఎల్వో తమ విధులను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే, ఆరోగ్యకరమైన ఓటరు జాబితా రూపొందుతుందని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కుంటారని పేర్కొన్నారు. అన్ని పొలిటికల్ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు రేపటి నుండి రెండు రోజులపాటు అన్ని మండలాలలోని బీఎల్‌వోలు, బీఎల్వో సూపర్వైజర్లకు శిక్షణను ఇస్తారన్నారు. అనంతరం జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు నారాయణఖేడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్, జహీరాబాద్ ఆర్డిఓ వెంకారెడ్డి నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లకు సమగ్ర శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నగేష్, రెవిన్యూ డివిజనల్ అధికారులు రవీందర్ రెడ్డి,అందోల్ - జోగిపేట ఆర్డిఓ పాండు, నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

అందోల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో మరోమారు బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని ఎర్రారం నేరేడుగుంట గ్రామానికి చెందిన పలువురు యువజన సంఘాల సభ్యులు, నేరేడుగుంట నాయి బ్రాహ్మణ సంఘానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో రైతులకు, పేదలకు కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలు నచ్చి అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రజలందరూ ఏకతాటి పైకి వచ్చి కేసీఆర్‌కు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. అందుకు ఈ చేరికలే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, అందోల్ మండల ఎంపీటీసీల పోరం అధ్యక్షులు కృష్ణ గౌడ్, నాయకులు పత్తి వీరేశం, శ్రీధర్ రెడ్డి, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ పోరాటం

- పార్టీ పట్టణాధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నర్సింహారెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ పట్టణ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి అన్నారు. రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సమాచారం కోసం సమాచార హక్కు చట్టం కింద మంగళవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో విద్యుత్ పటాన్‌చెరు డివిజనల్ అధికారి రమేష్ చంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతాంగానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు మెప్పు కోసమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆరాటం ఉన్నదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, లక్ష రూపాయల రైతు రుణమాఫీ, ప్రతీయేడు రైతులకు అందిస్తున్న యూరియా, డీఏపీ అడుగు మందు, వరి, మక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించడం వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు హబీబ్ జాని, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ కమిటీ ఉపా అధ్యక్షులు మాదస్ శేఖర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ అక్రం నాయకులు కుంచాలా కిషన్, సంతోష్ కుమార్, ఖదీర్, ఉమ్మర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మెదక్ రీజియస్‌లో 16 మందికి పదోన్నతులు



నవతెలంగాణ-సంగారెడ్డి

టీఎస్ ఆర్టీసీ మెదక్ రీజియస్‌లో 25 ఏండ్ల నుంచి కండక్టర్లుగా, డ్రైవర్లుగా సర్వీసు చేస్తున్న 16 మంది సూపర్ వైజర్లుగా పదోన్నతి పొందారు. అందులో 13 మంది కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లు పదోన్నతి పొందారని వారికి రీజినల్ మేనేజర్ ఎస్. సుదర్శన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డర్ కాపీలు అందజేశారు. కాగా సంస్థ అబివృద్ధికి, ఈ రీజియన్‌ను ముందంజలో తీసుకురావడానికి కృషి చేయాలని సూచనలు ఇచ్చారు. పదోన్నతి పొందిన వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. చాలా ఏండ్లుగా సంస్థలో తమ విధులను అంకితభావంతో నిర్వహించడం వలన తమ పిల్లలు మంచి స్థాయికి ఎదిగారని వ్యక్తం చేసారు. ఈ పదోన్నతులు తమ అదృష్టంగా భావిస్తూ ఉద్యోగసోదరులు సోదరిమణులు అందరూ అంకితభావంతో పని చేయాలని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్స్ శ్రీ.దైవాదీనం గారు, శ్రీమతి. జ్యోస్న, పర్సనల్ ఆఫీసర్ సుజాత, అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సంపత్ కుమార్, డిప్యూటీ సుపెరిండెంట్ యస్.వెంకటేశం పాల్గొన్నారు.

ఈనెల 20న ఉద్యోగమేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-(ఈజీఎంఎం) వారి ఆధ్వర్యంలో రేపు(గురువారం) ఉదయం 10.00 గంటలకు పాత డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఓ శ్రీనివాసరావు మంగళవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో రెండు ప్రయివేటు కంపెనీలు పాల్గొంటున్నట్టు చెప్పారు. జె.కే. ఫెన్నార్ (ఇండియా) లిమిటెడ్ కంపెనీలో ప్రొడక్షన్ అసోసియేట్ పోస్టులు 65, వరుణ్ మోటార్స్ కంపెనీలో 200 ట్రైనీ సర్వీస్ అడ్వైజర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రొడక్షన్ అసోసియేట్ పోస్ట్‌కు 19 నుండి 30 ఏండ్లలోపు వయస్సు కలిగి ఉండి, 10వ తరగతి పాస్, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులన్నారు. కనీస వేతనం విద్యార్హతల మేరకు రూ.8,500 నుంచి రూ.10,150 వరకు లభిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు పటాన్చెరులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ట్రైనీ సర్వీస్ అడ్వైజర్ పోస్ట్‌కు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటిఐ, బీటెక్, డిప్లమో విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులని, అభ్యర్థుల వయస్సు 19 నుంచి 30ఏండ్లలోపు ఉండాలన్నారు. కనీస వేతనం రూ.9,000, రూ.12,000 ఇన్సెంటివ్స్ ఉంటాయని, ఎంపికైన అభ్యర్థులు హైదరాబాదులో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు జూలై 20న ఉదయం 10 గంటలకు బైపాస్ రోడ్డులో గల పాత డీఆర్డిఏ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూలకు, విద్యార్హతల జిరాక్స్, ఆధార్ , రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం మండల విద్యాధికారి ఉచిత నోటు పుస్తకాలను మంగళవారం అందజేశారు. మండలంలోని 28 పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు 35,260 నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్టు ఎంఈఓ తెలిపారు. 6,7 తరగతులకు చెందిన ఒక్కో విద్యార్థికి 6 నోటుపుస్తకాలు, 8వతరగతిలో 7, 9,10 తరగతుల్లో 14, ఇంటర్మీడియట్‌లో 12 నోటుపుస్తకాలు చొప్పున పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని.. ఉత్తమ విద్యను అభ్యసించి దేశానికి, సమాజానికి సేవలందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సీఆర్పిలు మరియు పీటిఐలు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని మద్దికుంట గ్రామంలో మణయ్యకు చెందిన ఆవు మేత కోసం వెళ్లి కరెంటు వైర్లను తాకడంతో మంగళవారం మృత్యువాత పడింది. ఈ విషయం తెల్సుకున్న తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ హుటాహుటిన పార్టీ నాయకులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడికి కొంత ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. భూముల యాజమానుల నిర్లక్ష్యంతోనే మూగజీవాలు చనిపోతున్నాయని, కరెంట్ తీగలు జాగ్రత్తగా అమర్చుకో వాలన్నారు. మణయ్యను అందరూ ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇంఛార్జి సందీప్ పాటిల్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు కట్కం వీరేష్ గుప్త, సామాజిక సేవకులు రాజన్న, పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, సోమేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు త్వరలోనే ఇండ్ల స్థలాలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం, జిన్నారం

అర్హులైన నిరుపేదలందరికీ 75 గజాల ఇళ్ల స్థలం అందించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, అతి త్వరలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఖాజిపల్లి గ్రామ పరిధిలో నిరుపేదలకు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు.. ప్రతి గ్రామంలో ఇళ్ల స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించడంతోపాటు ఇప్పటివరకు ఇండ్లస్థలం లేని నిరుపేదలకు 75 గజాల స్థలం అందించనున్నట్టు చెప్పారు. ప్రతీ గ్రామంలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయడంతో పాటు, ఖాళీ స్థలాల సేకరణ చేపట్టామన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అర్హులైన జర్నలిస్టులందరికీ అతి త్వరలో ఇళ్ల స్థలాలు అందించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ల ఎదుట ధర్నా





నవతెలంగాణ-సంగారెడ్డి, నారాయణఖేడ్

పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం 13 రోజుల నుంచి సమ్మె చేసున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో.. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం సంగారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు, నారాయణఖేడ్‌లో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యద ర్శులుగా గుర్తించాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్యం పనులు చేస్తూ.. రాష్ట్రానికి అవార్డులు తెస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదని వాపోయారు. వారిని వెంటనే పర్మినెంట్ చేసి.. కనీస వేతనం రూ.19,000 ఇవ్వాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇన్సూరెన్స్ పథకాన్ని ఐదు లక్షలకు పెంచాలని.. ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమాద బీమా, గ్రాట్యూటీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నెలనెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని.. ఏడాదికి మూడు జతల యూనిఫామ్స్, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇతర అలవెన్సు ఇవ్వాలన్నారు. కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ సిబ్బంది గత 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేని యెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, గ్రామ పంచాయతీ కార్మికులు ఎంకన్న, సంజీవులు ఆనందం, నర్సింలు, బిక్షపతి, పాండు, నగేష్, నాగరాజు, సుదర్శన్, నారాయణఖేడ్‌లో సీఐటీయూ నాయకులు రమేష్, రాములు, పోచయ్య, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి 'ఎన్నికలు'



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల బాలుర కళాశాల పాఠశాల విద్యార్థులు మంగళవారం ఓ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సాంబ్యానాయక్, గాయత్రీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికల కార్యక్రమాన్ని స్వయంగా విద్యార్థులే నిర్వహించడం గమనార్హం. దీనికి సంబంధించి సాధారణ ఎన్నికలకు నిర్వహి ంచే నమూనా ప్రక్రియను వారు చేపట్టారు. అట్టముక్కలతో బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్ చీటీలతో బ్యాలెట్ పేపర్, కెప్టెన్, వైస్ కెప్టెన్‌కు సంబంధించిన పోటీదారులు, నామినేషన్లు, స్క్రూటీనిలు, విత్‌డ్రాలు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్, లాంటి ప్రక్రియలను స్వయంగా చేపట్టారు. గిరిజన గురుకుల బాలుర పాఠశాల కళాశాలలో గల మొత్తం విద్యార్థులందరూ నమూనా ఓటు హక్కును వినియోగించుకోవడం, ఓటు వేసిన విద్యార్థుల ందరికీ, చేతి వేలికి సిరాచుక్కను ఉపయోగించడం అచ్చం సాధారణమైన ఎన్నికల ప్రక్రియను తలపించింది. కెప్టెన్ కు ముగ్గురు పోటీ దారులు, వైస్ కెప్టెన్‌కు ముగ్గురు పోటీ దారులు ఎన్నికల్లో పోటీపడ్డారు. విజయవంతంగా ఈ ప్రక్రియను విద్యార్థులు చేపట్టడం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ విధివిధానాలు తెలుసుకోవడం కోసం ఇలాంటి ప్రత్యేక కార్యక్రమం విద్యార్థులు అద్భుతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని గిరిజన గురుకుల పాఠశాల కళాశాలల సాంఘిక శాస్త్రం బోధకులు శ్రీనివాస్, బాలలక్ష్మి, జగన్ పర్యవేక్షించగా విద్యార్థుల సునిశితమైన దృక్పథాన్ని ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సాంబ్యా నాయక్, గాయత్రిలు ప్రశంసించారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి







నవతెలంగాణ-జహీరాబాద్, హత్నూర, కోహిర్

అర్హులైన ప్రతీ రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, హత్నూర మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, కోహిర్‌లో వ్యవసాయ సంచాలకులు బిక్షపతి రైతులకు విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్‌లోని స్థానిక అగ్రికల్చర్ ఏడి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పెంటారెడ్డి, హత్నూర మండలంలోని చందాపూర్, కొనంపేట్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ శ్రీనివాసరావు, కోహిర్ మండలంలో బిక్షపతి మాటాడుతూ.. రైతు అకస్మాత్తుగా మృతి చెందితే రైతుబీమా ద్వారా నామినీకి పది నుంచి పదిహేను రోజుల్లో ఐదు లక్షల రూపాయల సాయాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం ప్రస్తుతం ఆరో ఏడాదిలోకి అడుగు పెట్టిందని.. ఇప్పుడు 18 జూన్ 2023 వరకు ధరణిలో పట్టా పాసుబుక్కులు పొందిన రైతులందూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈసారి పోడు పట్టా పొందిన వారికి కూడా బీమా అవకాశం ఉన్నదన్నారు. కాబట్టి అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం నింపి, ఆధార్, నామినీ ఆధార్ జత పరిచి ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జహీరాబాద్‌లో వ్యవసాయ సహాయ సంచాలకులు బిక్షపతి, విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, రాజు, శ్రీకాంత్, హత్నూరలో వ్యవసాయ విస్తరణ అధికారి వర ప్రతాప్, రైతులు గొల్ల కృష్ణా, మానిక్ రెడ్డి, దాసరి బాలకృష్ణ, కోహిర్‌లో మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఏఈఓ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ ఆంజనేయులును సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సాంఘీక సంక్షేమ గురుకులాల సూపరింటెండెంట్ అర్. ఆంజనేయులును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్.సి.ఓ భూమయ్యకు జిల్లా ప్రజా సంఘాల నాయ కులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు కలకుంట్ల అనిల్, ప్రవీణ్ సంచల, తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర నాయకులు ఎల్ వేణుగోపాల్, టీఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎం.డి. ఖాజ, గురుకుల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర నాయకులు పండు, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రేమ్ కుమార్‌లు మాట్లాడుతూ.. పని చేయనప్పటికీ గురుకుల ప్రిన్సిపాల్స్‌లపై ఒత్తిడి చేసి పని చేసినట్టు బిల్లులను క్లయిమ్ చేసుకు ంటూ సదరు సూపరింటెండెంట్ అక్రమాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. గతేడాది నుంచి ఈ తంతు కొన సాగుతున్నదని అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టడం లేదన్నారు. పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో తన టీమ్ ద్వారా డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకుంటున్నారన్నారు. ఎస్సీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని.. గురుకుల పాఠశాల హాస్టల్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కానీ యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణకు తరలిన పద్మశాలీలు



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణకు మంగళవారం మండలంలోని పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ ఏర్పాటు చేయాలని తన మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక బీసీ నాయకుడు కొండా లక్ష్మణ్ అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నస్కల్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు మురళి, గణేష్, శ్రీనివాస్, సతీష్, మహేష్, శంకరయ్య, బాలనర్సు, పాండురంగం, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ గిరిజన గురుకుల ప్రిన్సిపాల్‌ని వార్డెన్‌ని సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్

నవతెలంగాణ సంగారెడ్డి



సిర్గాపూర్ మండలంలో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలంలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌ను, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో, ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఫుడ్ పాయిజన్ వల్లే విద్యార్థులు స్వస్థతకు గురయ్యారన్నారు. జిల్లా అధికారులు హాస్టల్‌ను సందర్శించి సమస్యలు పరిష్కారం చేయాలని అదేవిధంగా ప్రిన్సిపాల్ ని హాస్టల్ వార్డెన్ ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

వైయస్సార్ టీపీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నరేష్

నవ తెలంగాణ-టేక్మాల్



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలను తక్షణమే అందించాలని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని వైయస్సార్ టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. టేక్మాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ, లెక్చరర్స్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, దుర్గేష్, మనోహర్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు..

కథలు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీస్తాయి

టీటీడీ ధర్మ జాగరణ పరిషత్ బాధ్యులు లక్ష్మీనారాయణ శర్మ

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



పురాతన ఇతిహాస చారిత్రక అంశాలతో కూడిన కథలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం ఉమ్మడి జిల్లా ధర్మ ప్రచార పరిషత్ బాధ్యులు లక్ష్మీ నారాయణ శర్మ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కథ చెబుతారా ఊ కొడతారా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలలో శిశు మందిర్ సంస్కార్ విద్యాలయ సాయి చైతన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. శిశు మందిర్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి అర్చన ప్రథమ బహుమతి గెలుపొందగా, రెండవ బహుమతి సాయి చైతన్య పాఠశాలకు చెందిన. మహల్లవి, తృతీయ బహుమతి శిశు మందిర్‌కు చెందిన ఐదవ తరగతి విద్యార్థి లిఖిత్‌లు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం బాధ్యులు రాంరెడ్డి వ్యాపారవేత్త రాగం సిద్దేశ్వర. శిశు మందిర్ ప్రధానాచార్యులు వీరప్ప సంస్కార్ విద్యాలయ ప్రిన్సిపల్ సీతారామరావు ఆచార్యులు జైహింద్ రెడ్డి శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి మృతి

నవ తెలంగాణ-నిజాంపేట



ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గెరిగంటి శ్రీకాంత్(33) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతని కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై ఆదివారం ఉదయం తాళ్లపల్లి గ్రామ శివారులో గల అతని వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి విద్యార్థి మాత్రను తీసుకునేలా చూడాలి

డాక్టర్ రవికుమార్

నవతెలంగాణ-నార్సింగి



జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జూలై 20వ తేదిన నిర్వహించనున్నారని నార్సింగి మండల ఆరోగ్య అధికారి డాక్టర్ వై. రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిపి చిందం సబిత రవీందర్ అధ్యక్షతన మండల ఆరోగ్య అధికారి డాక్టర్ యెంగల రవికుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు నులి పురుగుల నిర్మూలన కోసం మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమస్య ఎక్కువగా పిల్లలలో ఉంటుందని, అందుకే పాఠశాలలలో పిల్లలకు మందులు అందజేస్తారన్నారు. నులి పురుగులు ఎక్కువ శాతం చేతులను శుభ్రం చేయకుండా తినడం వల్ల, అపరిశుభ్రమైన నీరు త్రాగడం వల్ల వస్తాయని, చెప్పులు లేకుండా మట్టిలో తిరగడం వల్ల కూడా వస్తాయన్నారు. కడుపులో నులి పురుగులు ఉండడం వల్ల ఎనీమియా (రక్త హీనత) సమస్య వస్తుందని, దీని పర్యవసానంగా పిల్లలలో ఎదుగు దల క్షీణిస్తుందని, అనేక రకమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. నులి పురుగులు అంటు వ్యాధి కాదని, కానీ ఒకరు త్రాగిన నీటిని వేరే వారు తాగితే కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. నులి పురుగుల నిర్మూలన కోసం ఆల్బెన్డాజోల్ మందును ఇస్తారని ఇది మాత్రల రూపంలో ఉంటుందని, ఈ మాత్రలను నమిలి తినాలన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ మాత్రలను పొడి చేసి, ఆపై వయసు వారు నమిలి తీసుకోవాలన్నారు. బడి పిల్లలకు 20 న మధ్యాహ్నం భోజనం చేశాక ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి విద్యార్థి మాత్రను తీసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోజు పాఠశాలకు హాజరు కాని వారికి 29న ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి సబిత మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి విద్యార్థి మాత్రను సరైన పద్ధతిలో తీసుకునేలా చూడాలన్నారు. అంగన్వాడీ లలో చదివే పిల్లలకు అంగన్వాడీ టీచర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ కరుణశ్రీ నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దురద సమస్యతో చాలా మంది వస్తున్నారని, అందుకు కలుషిత నీరు త్రాగడమే కారణమని అనగా, ఎంపిపి సబిత వెంటనే నార్సింగి పంచాయితీ ఈ.ఓ వెంకటేష్‌ను నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఫోన్ చేసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, మండల ఆరోగ్య అధికారితో పాటు నార్సింగి ఎంపీటీసీ సత్యనారాయణ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మండలం లోని వివిధ పాఠశాలల ప్రధనోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

నవతెలంగాణ-రేగోడు : నులిపురుగుల నివారణ మాత్రలను ఈ నెల 20వ తేదిన పంపిణీ చేస్తున్నట్లు రేగోడు ప్రభుత్వ ఆసుపత్రి సిహెచ్‌ఓ సిద్దప్ప తెలిపారు. 19 సంవత్సరాల వయస్సు గల వారందరికి నూలి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్ : మర్కుక్ మండలం లోని చేబర్తి గ్రామానికి చెందిన మందాల బాలస్వామి (28) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మంగళవారం వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ ఎర్రబాగు అశోక్ ,ఉప సర్పంచ్ గుర్రాల స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్ ,రైతు బంధు సమితి అధ్యక్షులు జాలని బాలనర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు పోయిల మల్లేశం, గ్రామస్థులు, తదితరులున్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

- లేబర్ యాక్ట్‌కు తూట్లు
- బాలకార్మికులతో వెట్టిచాకిరీ
- రోడ్డు పక్కనే పారబోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు
- ఎమ్మెల్యే ఆదేశాలు భేఖాతర్

నవతెలంగాణ - మెదక్

మెదక్ పట్టణ శివారులోని పిల్లికొటల్ వద్ద మెదక్-చేగుంట రహదారిలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్ కొనసాగిస్తున్నారు. ఇందులో నీళ్ల, కొబ్బరి నూనె, ఆలిల్స్ సంబంధిత బాటిల్స్, చైర్స్, కూలర్లు, బారిల్స్ వంటి టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలను రీసైక్లింగ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుంటారు.

> ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ, చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ లేబర్ యాక్ట్‌కు తూట్లు పొడుస్తున్నారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్డు పక్కనే పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలను పారబోస్తున్నారు. ఏడాది కాలంగా ఎలాంటి పేరుతో కూడిన బోర్డును ఏర్పాటు చేయకుండా ఇష్టారీతిన ప్లాంట్‌ను కొనసాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

లేబర్ యాక్టుకు తూట్లు

లేబర్ యాక్టుకు తూట్లు పొడిచే విధంగా ప్లాంట్ నిర్వహణ కొనసాగుతోంది. ఈ ప్లాంట్లో సుమారు 30 మంది తాత్కాలిక కార్మికులు రోజూవారీ కూలీలుగా పని చేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్మికులతో పని చేయిస్తూ ఒక్కొక్కరికి రూ.250 రోజువారీ వేతనం చెల్లిస్తుండటంతో పాటు నిర్వాహకులు బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఆపరేషన్ స్మైల్లో భాగంగా తనిఖీలు చేపట్టిన చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధికారులు ఈ ప్లాంట్‌లో బాల కార్మికురాలిగా పని చేస్తున్న ఓ బాలికను గుర్తించి జిల్లా బాల రక్షా భవన్‌కు తరలించారు. విచారణ జరిపిన అధికారులు చర్యలు తీసుకున్నారు.

అనుమతులు ఉన్నట్టా.. లేనట్టా..?

చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే పరిశ్రమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం మొదలుకొని మున్సిపల్, కార్మికశాఖ, అగ్నిమాపక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ వంటి పలు శాఖల అధికారుల నుంచి అనుమతులు పొందాలి. వ్యాపారం లక్షల్లో టర్నోవర్ జరుగుతున్నట్లు అయితే ఆదాయ పన్ను శాఖ ద్వారా ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాలి. ఈ ప్లాంట్‌ను ఏడాది పాటుగా ఎలాంటి నేమ్ బోర్డును ఏర్పాటు చేయకుండా ఓ షెడ్డులో నిర్వహిస్తుండటం గమనార్హం. దీంతో ఆ పరిశ్రమకు అనుమతులు ఉన్నాయా, లేవా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.





ఎమ్మెల్యే ఆదేశాలు భేఖాతర్

మెదక్-చేగుంట ప్రధాన రహదారిలో పిలికోటల్ శివారులో కొనసాగుతున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమ వ్యర్థాలను రోడ్డు పక్కన కుప్పలు కుప్పలుగా ఇష్టారీతిగా పారబోశారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాల్సిందిగా అటు వైపుగా ప్రయాణించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్థానిక నేతలు, అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎమ్మెల్యే ఆదేశాలను భేఖాతర్ చేసినట్లు తెలుస్తోంది. గాలికి ప్లాస్టిక్ వ్యర్థాలు ఎగిరి పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడక ముందే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులున్నాయి

ప్లాంట్ వద్ద ఎలాంటి బోర్డు ఏర్పాటు చేయలేదు. రాజు ప్లాస్టిక్ రీసైక్లింగ్ పేరిట ప్లాంట్ కొనసాగిస్తున్నాను. ఆ బోర్డును మరో షాపు ఉన్నచోట ఏర్పాటు చేశాం. ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్ నిర్వహణకు అనుమతులున్నాయి. నా పరిశ్రమలో బాల కార్మికురాలు పని చేస్తున్నందున అధికారులు బాలరక్షాభవన్ కు తీసుకొచ్చారు. మెదక్ మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్ మిషన్ల సబ్సిడీకి సహకరించారు.

– ఎల్లప్ప, నిర్వాహకుడు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్







గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తూప్రాన్ డివిజన్‌లోని తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి మంగళవారం తూప్రాన్‌లోని శివాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో తూప్రాన్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి చేసి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా గ్రామపంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికుల శ్రమ ఫలితంగా ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు తీసుకుంటూ పంచాయతీ కార్మికుల సమస్యలను మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో 469 గ్రామపంచాయతీలలో సుమారుగా వెయ్యి మందికి పైగా గ్రామపంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు .ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయలేదన్నారు. పనికి గుర్తింపు, పని ప్రాదికన కనీస వేతనాలు ఈఎస్ఐ పీఎఫ్ ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని పిఆర్సిలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం పంచాయతీ సిబ్బందికి రూ.19 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడిచినా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు విధి నిర్వహణలో మరణించిన గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలన్నారు గత కొన్ని నెలల నుంచి గ్రామపంచాయతీలలో పెండింగ్ వేతనాలు ఉన్నాయని, వాళ్ళు ఎలా పనిచేయాలని ప్రశ్నించారు ఎంపీడీవో గ్రామ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు ఎనిమిది గంటల పని దినం, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు సంవత్సరానికి మూడు జతల యూనిఫాం, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 17 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా మంచినీటి సప్లైని, ఇతర సౌకర్యాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికులపై స్థానిక గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, సర్పంచులు వేధింపులు ఆపాలన్నారు. లేనిపక్షంలో స్థానిక కార్యాలయాలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కులను సాధించేంత వరకు ఈ సమ్మె కొనసాగుతుందన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఆర్డిఓకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 21న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి అసిఫ్, సత్యనారాయణ, ఎల్లం రాజు, యాదగిరి, నాగరాజు, మహేష్ స్వామి, సరిత, కిష్టయ్య. బిక్షపతి, అంజయ్య, బాలమణి, శోభ, నరసమ్మ, ఎల్లమ్మ, వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రాహుల్‌పై విమర్శలు కేటీఆర్ అహంకారానికి ప్రతీక

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మామిళ్ళ ఆంజనేయులు

నవతెలంగాణ-మెదక్ టౌన్



రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం కేటీఆర్ అహంకారానికి ప్రతీక అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మామిళ్ళ ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు పర్యాయాలు ప్రధానమంత్రి అవకాశం ఉన్నా మంత్రి పదవిని కూడా తీసుకోకుండా దేశ ఆర్థిక వ్యవస్థ కోసం, దేశ సమగ్రత కోసం ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్‌కు ప్రధానమంత్రి అవకాశాన్ని కల్పించిన రాహుల్ గాంధీపై విమర్శ చేసే ముందు కేటీఆర్ నీ వ్యక్తిత్వం గురించి ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తెలంగాణ రాష్ట్రమే రాకుంటే కేటీఆర్ నీ బతుకేందని విమర్శించారు. తెలంగాణ పేరు, కేసీఆర్ పేరు చెప్పి మంత్రి పదవిని అనుభవిస్తున్న కేటీఆర్‌కు రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కాదన్నారు. రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని విమర్శిస్తే బీఆర్ఎస్ పార్టీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2004లో ఉచిత కరెంటుపై తొలి సంతకం చేసి రైతులకు ఉచిత కరెంటు అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. తెలంగాణలో సోలార్ ప్లాంట్ అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఉచిత కరెంటు పేరుతో సంవత్సరానికి రూ. 8,000 కోట్లను బీఆర్ఎస్ పార్టీ దిగమింగుతున్నట్లు తెలిపారు. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నట్లు చెప్పి కేవలం ఎనిమిది గంటలే ఇస్తూ బీఆర్ఎస్ పార్టీ రైతులను మోసం చేస్తున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడూరు ఆంజనేయులు గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సార శ్యాంసుందర్, మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, హవేలీఘనపూర్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు లక్కర్ శ్రీనివాస్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ సింగ్ రాథోడ్, యూత్ కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గం అధ్యక్షులు రమేష్, ఎంపీటీసీ మైనార్టీ మెదక్ జిల్లా నాయకులు ఇస్మాయిల్ సూఫీ, సేవాదళ్ జిల్లా నాయకులు రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య

నవతెలంగాణ-మెదక్



చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఐసిఐసిఐ బ్యాంక్ చౌరస్తాలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జికేఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న మహనీయుడు, యువతరానికి ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా బాపూజీ పోరాటం చేశారని తెలిపారు. రాబోయే తరాల వారు కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం దేశంలోని బీసీలందరూ ఉద్యమించాలని కోరారు. బాపూజీ ఉద్యమ స్ఫూర్తి, తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాములు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బొద్దుల సంతోష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ బీమరి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు బొద్దుల కృష్ణ, యువజన డివిజన్ అధ్యక్షుడు గుండు ప్రశాంత్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- 13 అంశాలలో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా మొదటి స్థానం
- సీహెచ్‌సీ సూపరింటెండెంట్ మురళీ మోహన్‌కు మెమో జారీ

నవ తెలంగాణ-కౌడిపల్లి



వర్షాకాలం మొదలవడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి చందు నాయక్ పేర్కొన్నారు మంగళవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఫర్నిచర్ లేకపోవడంతో డాక్టర్ శ్రీకాంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫర్నిచర్ కొనుక్కోవాలని డాక్టర్ శ్రీకాంత్‌కు సూచించారు సామాజిక ఆరోగ్య కేంద్రంకు మౌలిక సదుపాయాల కోసం రూ. 4.71 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లాలోని పిఎస్సీలకు రూ.1.5 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ఒక్కొక్క పల్లె దవాఖానాలకు రూ. 50 వేలు మంజూరు చేశామన్నారు. గత మూడు నెలలుగా ఆసుపత్రిలో ఇద్దరిని క్యాన్సర్ రోగులను గుర్తించి వారిని మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని, జిల్లాలో 100% డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరగాలని కోరారు. మెడికల్‌లో 13 అంశాలకుగాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామని ఆయన గుర్తు చేశారు. ఆసుపత్రిలో బతుకమ్మ తాండాకు చెందిన మూడు సంవత్సరాల బాలునికి డెంగ్యూ వ్యాధిని గుర్తించి చికిత్స అందించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలందిస్తున్నామని ఆయన తెలిపారు. వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఇండ్ల చుట్టూ ఉన్న గుంతలు మురికి కాలువలను శుభ్రం చేసుకోవాలని ఆయన తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సూపరింటెండెంట్ మురళీ మోహన్‌కు మెమో జారీచేయాలని ఆదేశించారు. సిఎస్సి ఆసుపత్రి పనులు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించామన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో విజయలక్ష్మి, డాక్టర్‌లు శ్రీకాంత్, ఫర్నాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్యంలో లక్ష్యాన్ని నెరవేర్చాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



మెరుగైన విద్యా, వైద్యాన్ని అందించడంలో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం ప్రజావాణి హాల్లో పల్లె దవాఖాన, మన ఊరు-మనబడికి సంబంధించిన పనులపై ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని, పల్లె దవాఖానాల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాలలో ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్స్ ప్రమేయం లేకుండా, పల్లె దవాఖానలలో ఎంబిబిఎస్ డాక్టర్లతో పాటు అర్హత కలిగిన వైద్య సిబ్బందితో సేవలు అందుతాయని తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారాలు తీసుకొని పల్లె దవాఖానాలు ఏర్పాటు త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అల్లాదుర్గ్, రంగంపేట్, వెల్దుర్తిలలో గల పీహెచ్ సి రిపేరింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించాటానికి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదన్నారు. మన ఊరూ-మనబడికి సంబంధించిన పనులు పూర్తయిన వాటి వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎక్కడైనా పనులు మొదలు పెట్టకపోతే సంబంధిత అధికారులు దగ్గరుండి మార్కింగ్ వేసి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందునాయక్, డీపీవో సాయిబాబా, పంచాయత్ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, డీఈవో రాధాకిషన్, సంబంధిత శాఖ ఇంజనీర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి సీసీరోడ్డు వేయండి

నవతెలంగాణ -నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో తహసీల్దార్ కార్యాలయం ప్రధానమైంది. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిరోజు భూముల రిజిస్ట్రేషన్లు దాదాపు 30 నుండి 50 వరకు జరుగుతుంటాయి. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లడానికి రోడ్డు సరిగా లేక బురదలో రావాల్సి వస్తోంది. దారి మొత్తం గుంతలమయంగా మారడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ వద్దు బీఆర్ఎస్ ముద్దు

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్



కాంగ్రెస్ మూడు గంటల కరెంటు వద్దు బీఆర్ఎస్ 24 గంటల కరెంటు ముద్దు అని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాల గొంది గ్రామంలో రైతు వేదికలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటు చాలని అనుచిత వ్యాక్యలకు రైతులతో కలిసి ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతు బిడ్డ రైతుల బాధ తెలిసిన వ్యక్తి కాబట్టి రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. రైతులకు ఉచితంగా కరెంటు ఇస్తే ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయం రైతులు గమనిస్తున్నారని రైతులే కాంగ్రెస్ పార్టీని బొంద పెడతారన్నారు. రైతులు మూడు గంటలు వద్దు మూడు పంటలు ముద్దు అని నినాదాలు చేశారు. ఈ కార్యకరములో ఎంపీపీ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షులు బల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ సర్పంచ్ కనకయ్య, మాజీ ఎంపీటీసీ ముత్యం, మల్లేశం, కనుకరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేట తైక్వాండో విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన



నవ తెలంగాణ-సిద్దిపేట : హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లోని బాలాజీ గార్డెన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో క్యాడేట్ ఛాంపియన్‌షిప్ 2023లో సిద్దిపేట తైక్వాండో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనపరిచి 5 మెడల్స్ సాధించారని జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లోకేష్, బిందు గోల్డ్ మెడల్స్ సాధించగా, సుదాన్స్, రోహన్ చంద్ర, నిత్య బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు ఈ నెల 28 నుంచి 30 వరకు ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో జరిగే జాతీయస్థాయి తైక్వాండో క్యాడేట్ ఛాంపియన్‌షిప్ 2023కు ఎంపిక కాబడ్డారని తెలిపారు. విద్యార్థులను రాష్ట్ర తైక్వాండో అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా తైక్వాండో గౌరవ అధ్యక్షులు వేలేటి రాధాకృష్ణ శర్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ మోహన్ అభినందించారు.


మద్దూరుకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర



నవతెలంగాణ-మద్దూరు

విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు సైకిల్ యాత్రలో భాగంగా మంగళవారం మద్దూరు మండల కేంద్రానికి చేరుకొని మోడల్ స్కూల్ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గానికి సైకిల్ యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాగి జావా అందజేత




నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ఉదయం అల్పాహారంగా రాగి జావాను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఉచితంగా అందిస్తున్నట్లు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాగి, బెల్లం పొడిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారంలో భాగంగా ఈ రాగి జావాను అందజేస్తుందన్నారు. వారానికి మూడు రోజులు గ్రుడ్లు, మూడు రోజులు రాగి జావాను అందచేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి. రవీంద్ర రెడ్డి,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రాజమౌళి,ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రజిత, సీఆర్పీలు పెంటయ్య, మోహన్ బాబు, ఎంఆర్సీ సిబ్బంది ఉమాకాంత్ లు పాల్గొన్నారు

గురుకుల కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కళాశాల ప్రిన్సిపల్ లింగారెడ్డి



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్


నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాల గుందిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో (బాలుర) ఇంటర్మీడియట్‌లో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు శుక్రవారం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పి. లింగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోహెడలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుందని ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. బాలుర కళాశాలలో ఎంపీసీ గ్రూపులో 12, బైపిసి గ్రూపులో 19 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎంపీసీలో ఎస్సీ 7, ఎస్టి 1, మైనార్టీ 2, ఎస్సీ - సి 2, బైపీసీలో ఎస్సీలో 11, బిసి 1, ఎస్టి 2, ఓసి 1, మైనారిటీ 2, ఎస్సీ 2 రిజర్వేషన్ల వారీగా ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు కోహెడలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలో గ్రామాలకు గజ్వేల్ నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ ప్రత్యేక అధికారి రాజయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముర్మార్ నుంచి బొమ్మకల్ వరకు హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లైలో పైప్ లైన్ లీకేజీ మూలంగా మరమ్మతులు చేపడుతున్నామని ఆయన చెప్పారు. బుధవారం పనులు ప్రారంభించి గురువారం అర్ధరాత్రి వరకు పనులు కొనసాగుతాయని తిరిగి శుక్రవారం 21న నీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. బుధవారం నీటి సరఫరాను రెండు రోజులపాటు భద్రపరచుకొని, నీటిని వాడుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలు మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్లైన్ మరమ్మతులకు సహకరించాలని ఆయన కోరారు.

రేవంత్ రెడ్డి వ్యాక్యలకు నిరసన



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

విద్యుత్ విషయమై కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరైనవి కావని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు వంగ నాగిరెడ్డి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం నిరసన తెలిపి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా ఉన్న విషయం కాంగ్రెస్ నాయకులు మర్చిపోవద్దన్నారు. విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ నాయకులకు పూర్తి అవగాహన లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై విద్యుత్ సరఫరాపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పీఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, మాజీ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, బిఆర్ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షులు యాదగిరి, నాయకులు అంకుష్ వలి, కుమార్, జేపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను అందించిన పోలీస్



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ పోలీసులు మొబైల్ ట్రాకింగ్ ద్వారా 24 గంటల్లో గుర్తించి బాధితుడికి అందజేశారు. జగదేవపూర్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మునిగడప గ్రామానికి చెందిన మనది సతీష్ , ఈ నెల 16వ తేది రాత్రి తన వివో ఎస్25 ఫోన్‌ను పొలం నుంచి ఇంటికి వస్తుండగా దారిలోఎక్కడో పోగొట్టుకున్నాడు. వెంటనే జగదేవ్‌పూర్ పోలీసులకు ఫోన్ పోయిన సమాచారం ఇచ్చాడు. స్థానిక ఎస్ ఐ కృష్ణమూర్తి ఆదేశానుసారం కానిస్టేబుల్ జి .రమేష్ (టెక్ టీమ్) మొబైల్‌ని ట్రాక్ చేసి ఫోన్‌ని స్వాధీన పర్చుకోవడం జరిగింది. కాగా మంగళవారం భాదితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకొని పోయిన ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, పూర్తి వివరాలు సి ఈ ఐ ఆర్ అప్లికేషన్ లో నమోదు చేయాలని సూచించారు. బాధితుడికి ఫోన్‌ను అందించిన వారిలో పోలీస్ సిబ్బంది ఏ. ఎస్. ఐ. రమణ రెడ్డి , కానిస్టేబుల్ చంద్రం, రమేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దూల్మిట్ట తహసిల్దార్‌పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో ప్రోటోకాల్ ప్రకారం జెడ్పీటీసీ అయిన తనకు సమాచారం ఇవ్వకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన ఫామ్ హౌస్‌లో అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పట్టాలు పంపిణీ చేసినందుకు దూల్మిట్ట తహసిల్దార్ గోపాల్. ఆర్ఐ ఐలయ్యలపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్. హుస్నాబాద్ ఆర్డిఓ బెన్ శాలెంలకు.జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 30 మంజూరు కావడంతో 16 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులు పూర్తికాగా వాటిని లబ్ధిదారులకు పంచేందుకు గ్రామ సభ నిర్వహించి 16 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆయన తెలిపారు. గ్రామసభలో ఎంపిక చేసిన కొంతమంది లబ్ధిదారుల పేర్లు తొలగించి అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను కేటాయించారని ఆయన ఆరోపించారు. ప్రోటోకాల్ ప్రకారం జెడ్పీటీసీగా ఉన్న తనకు సమాచారం ఇవ్వకుండా జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన ఫామ్ హౌస్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారని ఆయన తెలిపారు. అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చేట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్, నాయకులు సాగర్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- గ్రామపంచాయతీ కార్మికులను పట్టించుకోరా?
- మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడికి యత్నించిన కార్మికులు
- పోలీసులకు కార్మికులకు మధ్య వాగ్వాదం
- మంత్రి పీఏకు వినతిపత్రం సమర్పణ







నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గత 12 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలో మంత్రి హరీష్‌రావు క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కార్మికులను అడ్డుకోవడంతో పోలీసులకు కార్మికులకు, సిఐటియు నాయకులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు కలగజేసుకొని కార్మికులను శాంతింపజేసి ఎట్టకేలకు కొంతమందిని అనుమతించడంతో క్యాంపు కార్యాలయంలో మంత్రి పీఏకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్ , గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తునికి మహేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న చట్టబద్ధమైన సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికులు అంటే ప్రభుత్వానికి చిన్న చూపు అయిపోయిందని వారు చేసిన శ్రమతోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. నాడు సఫాయి అన్న సలాం అంటూ సన్మానించిన ప్రభుత్వమే నేడు రోడ్డున పడ్డ పట్టించుకోవడంలేదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఇన్సూరెన్స్ కింద 10 లక్షలు ఇవ్వాలని జరుగుతున్న సమ్మెను ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కారం దిశగా తీసుకువెళ్లాలని అన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే గ్రామాలలో అత్యవసర సేవలను కూడా నిలిపివేసి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని అర్బన్, రూరల్, నారాయణరావుపేట, చిన్నకోడూరు ,నంగునూరు మండలాలతో పాటు జనగామ నియోజకవర్గంలోని చేర్యాల కొమురవెల్లి, దూల్మిట్ట, మద్దూరు మండలాలకు చెందిన గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13వ రోజు కొనసాగుతున్న సమ్మె మంగళవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఒంటికాలిపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు జేఏసీ ఆధ్వర్యంలో 13 రోజుల నుండి సమ్మె నిర్వహిస్తూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్మికుల కోరికలు గొంతెమ్మ కోరికలు ఏమి కావని, వారివి నిజమైన డిమాండ్లని, వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా ఇచ్చి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారుల వేధింపులు వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి పోరాటాలలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జాలిగామ ప్రభాకర్ జేఏసీ నాయకులు ర్యాగల లక్ష్మణ్,భోగి సాయికుమార్,కొమ్ము ఆంజనేయులు, కోడిపెల్లి చంద్రయ్య,కొమ్ము నర్సింలు, ఏలేశ్వరం రవి,పంజా శ్రీనివాస్, గోపాల్, చిలుముల భాగ్యలక్ష్మి, దున్న మల్లవ్వ, పసుల రజిత, పుష్ప, మల్ల మరి నర్సవ్వ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కార్మికుల మండల అధ్యక్షుడు మస్కురి శంకర్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడు తూ గంత 12 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మి కులు సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. 13 వ రోజు నియోజకవర్గంలో ర్యాలీలో పాల్గొనేం దుకు వెళ్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీవో ప్రకారం వేతనాలను పెంచాలని ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.మండల గ్రామ పంచాయతీ కార్మికులు మల్లేశం, పిట్ల రాములు, వడ్డే కుమార్, ఇదుగల్ల భిక్షపతి, యాదగిరి, యేసు, అక్కవ్వ,కనకవ్వ తదితరులు వెళ్లారు.

నవ తెలంగాణ-గజ్వేల్

గ్రామపంచాయతీ కార్మికులకు 11వ పిఆర్సి ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐపిఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని, రాష్ట్ర జేఏసీ యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని సీఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె 13వ రోజు చేరుకుంది ఈ సందర్భంగా గజ్వేల్ గడ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి గడ అధికారి ముత్యం రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యను సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చట్టబద్ధంగా జరుగుతున్న సమ్మె అని ప్రభుత్వాధికారులకు 15 రోజుల ముందు నోటీసు ఇచ్చి సమ్మె చేయడం జరుగుతుందని కానీ ప్రభుత్వ యంత్రాంగం మండలాధికారులు గ్రామపంచాయతీ కార్మికులను బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కరోనా సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులను దేవుళ్ళని సన్మానాలు చేసిన ప్రభుత్వం నేడు పట్టించుకోవడంలేదని విమర్శించారు. గ్రామపంచాయతీల ద్వారా వేతనాలు అందజేస్తున్న నెల నెల ఇవ్వడంలేదని గ్రామపంచాయతీలకు సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు వెంకట చారి, నాయకులు స్వామి, మహాలక్ష్మీ కనకవ్వ నాగరాజు, కుమార్, ఎల్లం, వెంకటేష్, నరసింహులు, పోశయ్య నాంపల్లి మల్లయ్య, గణేషు ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

జీపి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తామని , వెంటనే జీపీ కార్మికులందరిని పర్మినెంట్ చేసి, వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల నాయకులు ఎండి సాదిక్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరుకుంది. దీంతో వివిధ మండలాలకు చెందిన జీపీ కార్మికులు దుబ్బాక మండలానికి చేరుకుని బస్టాండ్ నుంచి దుబ్బాక పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా







బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు సాదిక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం వేతనాలను పెంచి, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి పిఎఫ్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వం న్యాయం చేసే వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపి కార్మికులు ప్రశాంత్, శ్రీను,రవి, శ్రీకాంత్, దుర్గవ్వ, ఎల్లవ్వ, బాబాయి, లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కష్టాలు తప్పవు



నవతెలంగాణ-నంగునూరు

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కష్టాలు తప్పవని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్‌లు సూచించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామ రైతు వేదికలో ఉచిత కరెంట్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నంగునూరు మండలంలోని పాలమాకుల, రాజగోపాల్ పేట, ముండ్రాయి, బద్దిపడగ, దర్గపల్లి, జేపీ తండా గ్రామాలకు చెందిన వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. రైతులకు మూడు పంటలు కావాల్నా? మూడు గంటల కరెంట్ కావాల్నా? అనే విషయంపై ఆలోచించి కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్ధరాత్రి వచ్చే కరెంట్‌తో చాలా మంది రైతులు కరెంట్ షాక్‌కు గురై చనిపోవడం జరిగిందని గుర్తు చేశారు. పండించిన పంటలను కొనేవారు లేక దళారుల పాలై మోసపోయామని, ఎరువుల బస్తాల కోసం లైన్‌లో రోజుల తడబడి నిలబడి సొమ్మసిల్లి పడిపోయిన సంఘటనలున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సీఎం కేసీఆర్ రైతులకు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు భీమా, సకాలంలో ఎరువులు అందించడం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని తీర్మాణ పత్రాన్ని అందించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ఎంపీటీసీ ఏటీ తులసీ పరమేశ్వర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వేముల వెంకట్ రెడ్డి, సంగు పురేందర్, సర్పంచ్లు సీతా బాలయ్య, భిక్షపతి నాయక్, నాయకులు రంగు రాజు గౌడ్, జాజల చందు, ఐలయ్య, వేణు చక్రవర్తి, మహిళా సంఘాల నాయకురాలు గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో ఉపాధికి ఊతం

మంత్రి హరీష్ రావు చొరవతో సిద్దిపేటలో వృత్తి నైపుణ్య కేంద్రం

రూ .10 కోట్లతో న్యాక్ భవనం నిర్మాణం



నవ తెలంగాణ- సిద్దిపేట

నిర్మాణ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఆసక్తి చూపే ఉమ్మడి మెదక్ జిల్లా వాసులకు మంత్రి హరీష్ రావు తీపి కబురు చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లా నిర్మాణ రంగ నిరుద్యోగులకు మంత్రి హరీశ్ రావు అండగా మారారు. వృత్తి నైపుణ్యం కోసం హైదరాబాదులో ఉన్న న్యాక్- నిర్మాణ రంగంలో మెళుకువలు నేర్పిస్తారు. జాతీయ శిక్షణా కేంద్రం అనుబంధంగా జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఇప్పటికే న్యాక్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నిర్మాణ రంగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా ఇందు కోసం యువత శిక్షణ కోసం హైదరాబాదులోని హైటెక్ సిటీలో ఉన్న న్యాక్ వరకు వెళ్ళకుండా సిద్దిపేటలోనే ఏర్పాటు చేయడం ఊరట కలిగించిన అంశం. శిక్షణ కేంద్రం ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ చూపిన మంత్రి ఇందుకు అవసరమైన వృత్తి నైపుణ్య కేంద్ర నిర్మాణం కోసం ఇటీవలే రూ. 10 కోట్లు నిధులు మంజూరు చేశారు. కాగా మంత్రి హరీశ్‌రావు న్యాక్ భవనానికి బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. జి ప్లస్ 2 గా దీని నిర్మాణం జరగనుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో హాల్, ఫస్ట్ ఫ్లోర్ లో డైనింగ్ హాల్, టాయిలెట్స్ , రెండవ అంతస్తులో క్లాస్ రూమ్స్, శిక్షణార్థులకు వసతి గృహం ఏర్పాటు కానుంది. రాష్ట్రంలోనే మోడల్‌గా న్యాక్ భవనం నిర్మాణం కానుంది. నిర్మాణ రంగ నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ, స్వాగతిస్తున్నారు. ఈ భవనం పూర్తయితే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్-న్యాక్ సెంటరులో లార్సన్ అండ్ టూబ్రో ఎల్ అండ్ టీ సంస్థ ప్రతియేటా 300 మంది నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నారు.

తంజీమ్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవ తెలంగాణ-సిద్దిపేట

తంజీమ్ ఎన్నికలను వెంటనే అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తంజీమ్ ఎన్నికలను అధికారికంగా నిర్వహించాలని చెబుతూనే, ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. గత కొన్ని రోజుల క్రితం ముస్లింలంతా తంజీమ్ ఎన్నికలపై సమావేశం నిర్వహించగా, తంజీమ్ కమిటీ నాయకులు మీరు మాట్లాడే విధంగా ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు సహకారం అందిస్తామని పోలీసులు చెప్పారన్నారు. కానీ తంజీమ్ కమిటీ నాయకులు ఎన్నికలు నిర్వహించకుండా దొంగల్లాగా పదవులు పంచుకుంటున్నారన్నారు. ఎన్నికలకు సహకరిస్తామని చెప్పిన పోలీసుల మాటలు ఏమయ్యాయన్నారు. ముస్లిం యువకులు పెద్దలు ఇకనైనా ఆలోచించాలని మన హక్కులను మనమే కాపాడుకోవాలన్నారు. బుధవారం ఇక్బాల్ మినార్ వద్ద ఎన్నికలు నిర్వహించాలని ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లింల అభివృద్ధి కోసం తంజీమ్ మంచి నాయకున్ని ఎన్నుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యదరి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

గజ్వేల్ అభివృద్ధికి అందరూ కలిసి రావాలి

రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని రాష్ట్ర ఆర్థిక ,ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. మంగళవారం జగదేపూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు ఎర్రోళ్ల జ్యోతి, చంద్రయ్య, రాసూరు వరలక్ష్మి, రామస్వామి, బీఎస్పీ పార్టీ మండల ఉపాధ్యక్షులు మన్న కనకయ్య, బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు మొత్తం 60 మంది తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులోని మంత్రి తన్నీరు హరీష్ రావు స్వగృహంలో సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్య వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్ని పార్టీల నాయకులు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు పండుగల శ్రీనివాస్ గౌడ్, నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు నర్సోల్ల స్వామి కొండపోచమ్మ చైర్మన్ మల్లం జానకి రాములు పిఎసిఎస్ డైరెక్టర్ ఎడపల్లి వెంకటయ్య ఉపసర్పంచ్ చిగురుపల్లి రమేష్ మాజీ ఉపసర్పంచ్ స్వామి కర్కపట్ల రాజు కర్కపట్ల గణేష్ తుమ్మ మీనయ్య తుమ్మ శీను నర్సోల ఐలయ్య కర్కపట్ల నర్సింలు కర్కపట్ల గణేష్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బీఎస్పీ పార్టీ బూత్ సెక్రటరీ కమిటీ మండల అధ్యక్షులు బక్కోళ్ల మల్లేష్ మెట్టు కనకయ్య.నర్సింలు.రాములు ఎస్సీ పెద్దమనిషి ఎర్రోళ్ల రవీందర్ ఎర్రోళ్ల ఆనంద్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు ప్రజలు బుద్ధి చెప్తారు



నవ తెలంగాణ -గజ్వేల్

బతుకులు బాగుపడతాయని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఉద్యమ నాయకులను కాదని కుటుంబ పాలన చేస్తున్న సీఎం కేసీఆర్‌కు గజ్వేల్ నియోజకవర్గం ప్రజలే తగిన బుద్ధి చెప్తారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు విరూపాక్ష శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్‌కు కమిషన్లు వచ్చే పనులు తప్ప ప్రజలకు అవసరమయ్యే పనులు జరగలేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్నారని ఉచిత కరెంటు మాటను అటకెక్కించి ప్రతిపక్షాలపై గ్లోబల్ ప్రచారాన్ని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికలప్పుడే బీసీలు దళితులు కులాలు గుర్తుకొచ్చి అమలు కానీ పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన చెప్పారు. పదవుల కోసం పాకులాడే ప్రతాపరెడ్డి రేవంత్ రెడ్డిని విమర్శించే హక్కు లేదన్నారు. రైతులకు రుణమాఫీ ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు భూములు పంచితే టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ భూములను అమ్మి వేల కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని, రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా గజ్వేల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు ప్రజలకు కలవని ముఖ్యమంత్రి ఎందుకన్నారు. ఈ కార్యక్రమంలో నక్క రాములు గౌడ్ , నేత నాగరాజు, క్యాసారం బాబా లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమ్మరి మల్లేశం (53) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, గ్రామ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్,ఎంపీటీసి గోలి నరేందర్, ఉపసర్పంచ్ కొండల్ రెడ్డిలు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

వృధాగా పెద్ద వాగు వర్షపు నీరు

ఎత్తి పోతల పథకం వృధాగా మారింది



నవతెలంగాణ-నంగునూరు

పెద్ద వాగు నుంచి పైప్ లైన్ ద్వారా మైసమ్మ చెరువుకు తరళించే ఎత్తి పోతల పథకం కాస్తా ఉత్త పోతల పథకంగా మారిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. మంగళవారం నంగునూరు గ్రామంలో పెద్దోళ్ళ బంగ్లా వద్ద పోచమ్మ ఎత్తి పోతల పంపు మోటార్లను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నంగునూరు గ్రామ రైతుల కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3.70 కోటతో నల్లపోచమ్మ ఎత్తి పోతల పథకం అందుబాటులోకి తెచ్చిందన్నారు. పనులు పూర్తై ప్రారంభించిన మంత్రి హరీష్ రావు రైతులకు వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఆ పంపు బావి అలంకరణగా మారిందని వాపోయారు. సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీష్ రావు చేసే అభివృద్ధి పనులు తన కమీషన్ కోసమే తప్ప ప్రజల ప్రయోజనాలు పొందడం చాలా తక్కువని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల పేరిట కోట్ల రూపాయలు వెచ్చించి చేసిన పనులు వినియోగంలోకి తేవడంలో శ్రద్ధ చూపకపోవడం బాధాకరమన్నారు. బాదకరమన్నారు. ప్రజల అవసరాల కన్నా కేవలం హరీష్ రావు కమీషన్, గుత్తేదారుల ఉపాధికోసం చేసినవే ఎక్కువని దుయ్యబట్టారు. మంత్రి హరీష్ రావు చెప్పే మాటలకూ చేసే పనులకు ఎక్కడ కూడ పొంతన ఉండదని ఆరోపించారు. తక్షణమే ఈ ఎత్తి పోతల మోటర్లను ప్రారభించి పెద్ద వాగు నుంచి వృధాగా పోతున్న వర్షపు నీటిని నంగునూరు మైసమ్మ చెరువులోకి మళ్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, రాగుల కృష్ణ, గౌరబోయిన సంపత్, బంగారు నర్సింలు, చింతల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బదిలీ

నవతెలంగాణ-పటాన్‌చెరు



జిహెచ్ఎంసి ఉప కమిషనర్ల బదిలీలలో భాగంగా పటాన్ చెరు, రామచంద్రాపురం(సర్కిల్ 22) జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాలయ్య బదిలీపై వెళ్లారు. డిప్యూటీ కమిషనర్ బాలయ్య గోషామహల్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పోచారం అసిస్టెంట్ ఎంపిఎల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ. సురేష్ పటాన్‌చెరు, రామచంద్రపురం ఉపకమిషనర్‌గా బదిలీపై రానున్నారు.

కురుస్తున్న వాన.. మురిసిపోయే రైతన్న

నవతెలంగాణ-మనూరు

మనూర్, నాగలిగిద్ద మండలాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి మోస్తారు వర్షం కురుస్తున్నది. ఈ యేడు వానాకాలంలో ఇప్పటివరకు కేవలం చిరు జల్లులే కురియగా.. మంగళవారం మోస్తారు వర్షం పడడంతో రైతన్నలు ఆనందంలో మునిగిపోయారు. ఈ వర్షాలతో పంటలకు జీవం పోసినట్టు అయిందని సంతోషం వ్యక్తం చేశారు.



వర్షాకాలంలో జర జాగ్రత్త

నవతెలంగాణ-గుమ్మడిదల

వర్షా కాలంలో ప్రజలు విద్యుత్ ఉపకరణాల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని.. ఇలాంటి సమయాల్లో తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. తడిసిన విద్యుత్ వైర్ల వద్దకు, ఇండ్లలో ఉన్న మీటర్ల వద్దకు వెళ్లకూడదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పశువులు, మనుషులు గాని వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూరి గుడిసెలు, పురాతనమైన ఇండ్లలో ఉండే ప్రజలు విద్యుత్ బోర్డులను చేతులతో ముట్టుకోకుండా ఎండిపోయిన కట్టే లేదా టెస్టర్ ద్వారా స్విచ్‌ను వేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ షాక్ సర్క్యూట్ జరిగితే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు.

పాత పెన్షన్ సాధన రథయాత్రను విజయవంతం చేయండి



నవతెలంగాణ-సిద్దిపేట

పాత పెన్షన్ సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదలైన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈ నెల 16న ఆలంపూర్ నుంచి బయలుదేరి, సిద్దిపేట జిల్లా కేంద్రానికి 27న రానున్నదని టిఎస్ సిపిఎస్ఇయు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చేగురి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి బత్తిరాజ్ శశి కుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు 27న సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీ, సమావేశానికి హాజరై, మన ఐక్యతను చాటి, పాత పెన్షన్ సాధనలో ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాకేష్ దేశ్పాండే , మహిళా కార్యదర్శి కరుణ శ్రీ, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంచార బట్టల వర్తక సంఘం అధ్యక్షుడిగా విఠలేశ్వర్



నవతెలంగాణ-దుబ్బాక

పద్మశాలి సంచార బట్టల వర్తక సంఘం అధ్యక్షుడుగా సోమ విఠలేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని దుబ్బాక పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి తెలిపారు. దుబ్బాక పట్టణ కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు బడుగు నగేష్, ప్రధాన కార్యదర్శి గజం నరేష్, సంయుక్త కార్యదర్శి గాజుల మల్లేశం, కోశాధికారి పుట్ట యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సోమ విఠలేశ్వర్ మాట్లాడుతూ పొట్టకూటికై ఊరూరా తిరుగుతూ బట్టలమ్మే తమకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.నూతనంగా ఎన్నికైన సభ్యులను పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి శాలువాలు కప్పి సన్మానించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఇఓ శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు మంగళవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే చక్కగా చదువుకొని పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, నవీన్, సరళ , మమత, ఎస్ఎంసి చైర్మన్ నరేష్ ఎర్త్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాజు, ఆంజనేయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు గురైతే 1930కి ఫిర్యాదు చేయండి

- జిల్లా ఎస్పీ ఎం.రమణ కుమార్

నవతెలంగాణ-సంగారెడ్డి



సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ఎం. రమణ కుమార్ అన్నారు. మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్‌లో భాగంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో మంగళవారం నెల వారీ నేర సమీక్షా సవావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో (అండర్ ఇన్వెస్టిగేషన్) ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి, నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, నేరస్తులను న్యాయస్తానం ముందు హాజరుపరచాలని ఎస్.హెచ్.ఒ. లకు సూచనలు చేశారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేస్తూ, కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని సూచించారు. పోక్సో, ఎన్‌డిపిఎస్ యాక్ట్ వంటి కేసులలో 60 రోజులలోపు ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలన్నారు. ఎవరైనా గంజాయిని సాగు లేదా సరఫరా చేసినా, నిల్వ చేసినా అట్టి వ్యక్తులపై చట్టరిత్య తగు చర్య తీసుకోవాలని, రిపిటేడ్ అఫెండర్స్ పై పిడి యాక్ట్ నమోదు చేయాలన్నారు. పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం, డీజిల్, పెట్రోల్ రవాణాలను అరికట్టాలని, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టరిత్య కఠిన చర్యలను తీసుకోవాలన్నారు. వర్టికల్ పనీతిరులో మెరుగైన ప్రదర్శన కనబరిచి, జిల్లాను ముందు వరుసలో నిలపాలని, ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఆయా వర్టికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి, అధికారులకు రివార్డులు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నేరాల అదుపునకు తమతమ సబ్-డివిజన్ లలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని, ధృవపత్రాలు లేని వాహనాలను, అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని డీఎస్పీలకు సూచించారు. రోడ్డు ప్రమాదాల కేసులలో నేర విచారణ చేసేటప్పుడు ఆ నేరం ఏ విధంగా జరిగింది, అందుకు కారణమైన వాహనంపై మాత్రమే కేసు నమోదు చేయాలన్నారు. అంతేగానీ వాహనం పెద్దదా, చిన్నదా అని చూడకూడదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తితో పాటు వెనకాల కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించా లన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలాంటి పక్షంలో తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేషనల్ హైవేలకు కలిసే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రెకర్స్ వేయించడం, హైవే రోడ్డు వ్యూ క్లియర్ గా ఉండేలా చూడాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాల గురించి ప్రజలకు వివరిస్తూ, స్వచ్ఛంధంగా వారి గ్రామాలలో మరియు ప్రధాన కూడళ్లల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఆన్లైన్ మోసాల గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీసు కళాబృంధం ఆద్వర్యంలో వివిధ నాటకాల రూపంలో ప్రజల ముందుకు వెళ్ళి వారిని చైతన్య పరచాలన్నారు. అనవసర లింక్‌లు ఓపెన్ చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో జహీరాబాద్ డిఎస్పి రఘు, నారాయణఖేడ్ డిఎస్పి వెంకట్ రామ్ రెడ్డి, డీసీఆర్.బి. డిఎస్పి బాలాజీ, ఇన్స్పెక్టర్ బి.రమేష్, ఎస్.బి. ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్. జిల్లా సిఐలు మరియు ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైంది

నవతెలంగాణ-మిరుదొడ్డి



మాయ మాటలు చెప్పి మోసం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో జరిగిన పొరపాటు నియోజకవర్గ ప్రజలు మరోసారి చేయొద్దన్నారు. బిజెపి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు. మీరుదొడ్డి మండల కేంద్రంలో పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 70 మంది మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పై ప్రజలు మక్కువ చూపడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుతుందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీకి దుబ్బాక నియోజకవర్గంలో గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఇప్పటికైనా మాయమాటలు చెప్పే పార్టీ నాయకుల మాటలు నమ్మకుండా బిఆర్ఎస్ పార్టీలో చేరడం పట్ల ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, సర్పంచ్ మండల అధ్యక్షుడు బాల రాజు, బాల్‌నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కరెంటు ఇవ్వని కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వొద్దు



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్ర రైతన్నకు సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మూడు గంటల విద్యుత్ చాలని చెప్పడం దుర్మార్గమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రైతుల పక్షాన నిలిచి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదని అన్నారు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీని, మత రాజకీయ పార్టీ బిజెపి నాయకులను గ్రామాల్లోకి రానివొద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-చేర్యాల



మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు చేర్యాల పట్టణ కేంద్రంలోని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు యువతను కోరారు. ఆయన మంగళవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలకు అనుకూలంగా డ్రైవింగ్ చేసే వారు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని కోరారు. కార్యక్రములో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లెల సిద్దారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చెర్మెన్ కాటం మల్లేశం, కాంగ్రెస్ ఫిషరిష్ రాష్ట్ర కార్యదర్శి మంజ మల్లేశం, కామిడి జీవన్ రెడ్డి,బుట్టి యాదగిరి, ఉట్లపల్లి శ్రీనివాస్,ఎండి. ఖాజా, మద్దూరు మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తుమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కరెంట్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం వివిధ విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో బుధవారం కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ప్రభాకర్ తెలిపారు.పాలమాకుల132/33 కేవీ మేన్ సబ్ స్టేషన్ మరమ్మతుల కార ణంగా ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. దీంతో నంగునూరు మండ లంలోని ఎనిమిది సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్షాలు కురుస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి

నవతెలంగాణ-గజ్వేల్



వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జకీర్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లా డుతూ రెండు మూడు రోజులుగా వరుసగా వర్షాలు వస్తున్నా యని శిథిలమైన ఇళ్లలో ఉండకుండా ముందస్తు ఆలోచనతో మరో ఇంటిలోకి మార్చుకోవాలని ఆయన సూచించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. అదేవిధంగా విద్యుత్ సరఫరాలో ఉన్న స్తంభాల వద్ద నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ముఖ్య ంగా ఇనుప స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని చిన్నపిల్లలను బయటికి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. అత్యవసరం ఉంటే మున్సిపల్ పాలకవర్గానికి లేదా అధికారులకు సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. పురాతనమైన ఇళ్లలో ఉంటే వర్షాకాలంలో మరింత దెబ్బ తినే అవకాశం ఉంటుందన్నారు.



ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

యువతీ యువకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి చందర్రావు అన్నారు. మంగళవారం ఇర్కోడ్, రాంపూర్ వెంకటాపూర్, బుస్సాపూర్ గ్రామాలలోని యువకులు సిద్ధిపేట ఆర్టిఏ కార్యాలయం వద్ద ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కొరకు హాజరు కావడం జరిగింది. అనంతరం ఎంపీపీ శ్రీదేవి పరిశీలించారు. మంత్రి హరీష్‌రావు సొంత ఖర్చుతో యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఉద్దేశంతో రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎర్ర యాదయ్య, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు మొక్కిల్ల మోహన్ రెడ్డి, సర్పంచులు సదాశివారెడ్డి, బిక్షపతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



నవతెలంగాణ-చేర్యాల

పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్బి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐఎస్బి జిల్లా అధ్యక్షులు పుల్లని వేణు,చేర్యాల మండల అధ్యక్షుడు ఆత్మకూరు హరికష్ణ, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల అఖిల్,నాయకులు మహేష్, చరణ్, అజయ్, కనకరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎంతో ఓటు వినియోగంపై అవగాహన



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణం లోని పలు పోలింగ్ కేంద్రాలలో మంగళవారం రెవిన్యూ అధికారులు ఈవీఎంతో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే తీరును అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అర్ ఐ సుహాసిని, జూనియర్ అసిస్టెంట్ కరీం పాల్గొన్నారు.

ఇంటర్‌లో 21న స్పాట్ అడ్మిషన్లు

నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేటలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల (టీఎస్ డబ్ల్యుఆర్) కళాశాలలో ఇంటర్మీడియట్‌లో మిగిలి ఉన్న సీట్ల ప్రవేశాల కోసం ఈనెల 21 న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రినిపాల్ సిహెచ్.ఉషాకిరణ్ మంగళవారం వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీ.ఈ.సి గ్రూపులో ఖాళీగా ఉన్న 22 (ఎస్సి-19, ఎస్టీ-3) సీట్లకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లను తీసుకోబడతాయాని తెలిపారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ దుబ్బాక రూరల్

దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ లో ప్రవేశాలకు విద్యార్థులకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ మంగళవారం తెలిపారు .బాలికల కళాశాలలో సీఈసీ గ్రూపులో మొత్తం 22 ,(యస్సి 19, ఎస్టీ 3) ఖాళీలుగా ఉన్నాయన్నారు. శుక్రవారం ఉదయం 10 గం.ల వరకు రామక్కపేట కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-కోహెడ

కోహెడ మండల కేంద్రంతో పాటు చిన్నకోడూర్ మండలంలోని సాంఘీక సంక్షేమ పాఠశాల కళాశాలలలో 44 సీట్లు ఖాళీ ఉన్నందున ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికిగాను ఈ నెల 21న మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ కె.వి.చలపతి తెలిపారు. కోహెడ బైపీసీలో ఎస్సీ 10 సీట్లు, మైనార్టీ 2, బీసీ 1, అలాగే చిన్నకోడూర్ మండలంలో ఎంపీసీలో ఎస్సీ 9, ఎస్టీ 1, మైనార్టీ 2, బైపీసీలో ఎస్సీ 13, ఎస్టీ 2, బీసీ 1, మైనార్టీ 02, ఓసీ 1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 21న మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఎసెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత పత్రాలతో కోహెడ పాఠశాలకు హాజరవ్వాలని ఆయన సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పోరేట్ స్థాయికి మించిన నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, వసతి, పుస్తకాలు, యునిఫామ్స్ ప్రభుత్వం అందిస్తున్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడ్డేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవ తెలంగాణ రాయపోల్

మెడిసిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేడ్చల్ ఆధ్వర్యంలో రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్ సహకారంతో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరు పేద ప్రజలకు ఉచిత వైద్యయ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు పట్టణాలకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకొనే స్తోమత లేని వారికి ఉచితంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించే మందులు పంపిణీ చేయడమే కాకుండా శస్త్ర చికిత్సలు కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. వివిధ విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్లు ఉచిత సేవలో భాగంగా శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందజేస్తున్నారు. గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు జ్యోత్స్న, భూమేష్, శతి, బారాస నాయకులు బొనగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.



20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



నవతెలంగాణ దుబ్బాక రూరల్

దుబ్బాక మండలంలోని ప్రతి పాఠశాలలో ఈనెల 20న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నామని, దీనికి పాఠశాల, ఆశ, అంగన్వాడి సిబ్బంది సహకరించాలని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నులిపురుగుల నివారణ, మాత్రల పంపిణీకి సంబంధించి తిమ్మాపూర్, రామక్కపేట పి హెచ్ సి ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల సమాజం కోసం నులి పురుగులను నిర్మూలించాలని కోరారు. ప్రతి పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రమైన తాగే నీరును విద్యార్థులకు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులలో నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనతతో తరచుగా అలసిపోతూ శారీరక, మానసిక అభివద్ధిలో వెనుకబడతారన్నారు.అందుకే ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భాస్కర శర్మ, తహసిల్దార్ సలీం మియా, ఎంఈఓ ప్రభుదాస్, ఐసిడిఎస్ సిడిపిఓ చంద్రకళ, రామక్కపేట పి హెచ్ సి వైద్యాధికారి హిమబిందు, నోడల్ ఆఫీసర్ తిరుపతి, వైద్య సిబ్బంది దయాకర్, రవీందర్, భాస్కర్, అంగన్వాడి, ఆశ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ బంగారయ్యకు పరామర్శ

నవతెలంగాణ - దౌల్తాబాద్

దుబ్బాక కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య మనవడు ఇటీవలే ప్రేమ విషయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం దౌల్తాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్, దొమ్మాట మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రావు, ఏఎంసి డైరెక్టర్ అంజి,మండల నాయకులు గంగాధరి రవీందర్ కలసి దుబ్బాకలో కౌన్సిలర్ బంగారయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.చిన్నతనంలో ప్రేమ కోసం ప్రాణాలు తీసుకోవడం తల్లిదండ్రులకు కడుపుకోత విధించారన్నారు. యువతీ యువకులు ఎదిగే వయసు జీవితం చాలా విలువైందని తెలిసీతెలవని వయసులో



ప్రేమలో పడి ప్రాణాలు తీసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు కన్న కలలను పిల్లలు సాకారం అయ్యే విధంగా ఉన్నతమైన చదువులు చదివి సమాజంలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని పిలుపునిచ్చారు.